

ఆలయంలో పూర్తయిన ఏర్పాట్లు (ఇన్‌సెట్‌లో) స్వామివారు (ఫైల్)

నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

» ఉపమాక క్షేత్రంలో ఏర్పాట్లు పూర్తి

నక్కపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో ఈ నెల 16వ తేదీన ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. సోమవారం ఉదయం 6.57 గంటలకు అర్చకులు కొండపైన, కింద ఆలయంలో ఘంటారావం (నెల గంట మోగించడం) చేయడంతో ధనుర్మాసాన్ని ప్రారంభిస్తారు. నెల రోజులపాటు ఉపమాక మాడవీధుల్లో గోదాదేవి అమ్మవారు, స్వామివారి తిరువీధి సేవలు నిర్వహిస్తారు. జనవరి 10వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా రంగనాథుడి అలంకరణలో స్వామి తిరువీధి ఉత్సవం జరుగుతుంది. జనవరి 13న గోదాదేవి కల్యాణం, 15వ తేదీన రాజాధిరాజ అలంకరణలో స్వామి గిరిప్రదక్షిణోత్సవం నిర్వహించనున్నారు.

గోవాడ షుగర్స్‌లో క్రషింగ్ సీజన్‌కు శ్రీకారం



బాయిలర్ వెలిగిస్తున్న ఎండీ సన్యాసినాయుడు

చోడవరం, డిసెంబరు 15: గోవాడ షుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ సీజన్‌కు సిద్ధమైంది. చెరకు క్రషింగ్ ప్రారంభ సన్నాహకాల్లో భాగంగా ఆదివారం ఉదయం బాయిలర్‌ను వెలిగించారు. ఫ్యాక్టరీ అధికారులు, కార్మికులతో కలిసి ఆదివారం ఉదయం ... మిగతా 6వ పేజీలో

ప్రశ్నార్థకంగా శాంతిభద్రతలు

పేట్రేగుతున్న రౌడీ షీటర్లు

» కొరవడిన పోలీసుల నిఘా
» రాత్రిపూట దారి దోపిడీలు
» మొక్కుబడిగా రాత్రి గస్తీ
» ఉనికి కోల్పోయిన స్పెషల్ బ్రాంచి
» దాబాల్లో మద్యపానం.. నిర్వాహకుల నుంచి నెలవారీ మామూళ్లు
» పోలీసు స్టేషన్‌లలో సివిల్ సెటిల్‌మెంట్‌లు
» చాపకింద నీరులా గంజాయి వినియోగం



సంకల్పం కార్యక్రమంలో భాగంగా గంజాయి, ఇతర డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా (ఫైల్ ఫొటో)

అనకాపల్లి రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రౌడీషీటర్లు రెచ్చిపోతున్నారు. కొంతమంది రౌడీషీటర్లు స్థానికంగా ఆధిపత్యం కోసం హత్యలకు తెగిస్తుండగా, మరికొంతమంది మద్యం మత్తులో హత్యలు, హత్యాయత్నాలకు పాల్పడుతున్నారు. గత నెల మూడో వారంలో నర్సీపట్నం మునిసిపాలిటీలోని కొత్త వీధిలో ఒక యువకుడి హత్యే ఇందుకు ఒక ఉదాహరణ. మరోవైపు జిల్లాలో గంజాయి వినియోగం చాపకింద నీరులా విస్తరిస్తున్నది. గంజాయికి అలవాటుపడిన వ్యక్తులు పలురకాల నేరాలకు పాల్పడుతున్నారు. కొంతమంది పోలీసుల అవినీతి, విధి నిర్వహణలో నిర్లక్ష్యంతోపాటు వైఫల్యం, అసాంఘిక శక్తులపై నిఘా కొరవడడమేనన్న ఆరోపణలు వినిపిస్తున్నారు. ఈ తరహా పోలీసు అధికారులు, సిబ్బంది పనితీరుపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాల్సిన స్పెషల్ బ్రాంచి విభాగం ఉనికిని కోల్పోయింది. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు, సిబ్బంది మామూళ్ల మత్తులో జోగుతూ విధులను విస్మరిస్తున్నట్టు విమర్శలు గుప్పుమంటున్నాయి. కొన్ని పోలీసు స్టేషన్లు భూ తగదాలు, వ్యక్తిగత గొడవల సెటిల్‌మెంట్‌లకు కేరాఫ్‌గా మారాయి.

రౌడీషీటర్లపై కొరవడిన నిఘా

జిల్లాలో రౌడీషీటర్లపై నిఘా కొరవడింది. కొంతమంది రౌడీషీటర్లు సెటిల్‌మెంట్‌లు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. గతంలో ప్రతి రౌడీషీటర్‌కు ఒక కానిస్టేబుల్‌ను లింక్ చేసేవారు. రౌడీషీటర్ ఉదయం నుంచి రాత్రి నిద్రపోయేంత వరకు ఎక్కెడెక్కడ తిరగాడు, ఎవరెవరితో మాట్లాడాడో సదరు కానిస్టేబుల్‌కు సమాచారం ఉండడంతో నేరాలకు పాల్పడేందుకు అవకాశం ఉండేది కాదు. అయితే ఈ ప్రక్రియను పోలీసులు సీరియస్‌గా అమలు చేయకపోవడంతో కొంతమంది రౌడీషీటర్లు రెచ్చిపోతున్నారు.

రాత్రిపూట దారి దోపిడీలు

జిల్లాలో రౌడీమూకలు, ఆకతాయిల అరాచకాలకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నది. వాహనాల రద్దీ తక్కువగా వుండే రహదారులు, నిర్మానుష్యంగా ఉండే ప్రాంతాలను ఎంపిక చేసుకుని దారి దోపిడీలకు తెగబడుతున్నారు. ప్రధానంగా ద్విచక్ర వాహనాలపై ఒంటరిగా వచ్చే వారిని లక్ష్యంగా చేసుకుని దాడి చేస్తున్నారు. డబ్బు, బంగారం వస్తువులను దోచుకుంటున్నారు. పరవాడ మండలం లంకెలపాలెం జంక్షన్ నుంచి సబ్బవరం వెళ్లే మార్గంలో, లంకెలపాలెం-అనకాపల్లి జాతీయ రహదారిలో తాడి మూడు కణాల నుంచి తాడి వెళ్లే రహదారిలో తరచూ దారి దోపిడీలు జరుగుతున్నాయి. కొంతమంది ఆకతాయిలు ముఠాలుగా ఏర్పడి అర్ధరాత్రి లారీలను ఆపుతున్నారు. డ్రైవర్లపై దాడి చేసి వారి నుంచి డబ్బులు లాక్కొంటున్నారు. చీకటి పడిన తరువాత ద్విచక్ర వాహనాలపై ఒంటరిగా వెళుతున్న యువతలను, మహిళలను ఉద్దేశించి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇటువంటి వారి ఆగడాలపై పోలీసులకు సమాచారం అందించినప్పటికీ సకాలంలో స్పందించకపోవడం, మరికొంతమంది పోలీసులు స్పందించినప్పటికీ ఆకతాయిలను అదుపులోకి తీసుకుని వారిని డబ్బులు గుంజుకుని వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

గంజాయి నియంత్రణకు 'సంకల్పం'



జిల్లా మీదుగా గంజాయి రవాణాను కట్టడి చేయడంతోపాటు విద్యార్థులు యువత గంజాయి జోలికి వెళ్లకుండా ఉండడానికి 'సంకల్పం' పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పోలీసు రికార్డుల ప్రకారం జిల్లాలో 397 మంది రౌడీషీటర్లు ఉన్నారు. రోజూ వారి కదలికలపై సిబ్బంది నిఘా కొనసాగుతుంది. రౌడీ షీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాలని సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులను ఆదేశించాం. రాత్రిపూట గస్తీ నిర్వహించే పోలీసులు.. తమ పరిధిలోని రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించాం. గతంలో హింసాత్మకమైన సంఘటనలు జరిగిన ప్రదేశాల్లో అవసరం మేరకు గస్తీ పెంచుతాం. కీలక ప్రదేశాల్లో మరిన్ని సీసీ కెమెరాలను అమర్చి నేరాల నియంత్రణకు కృషి చేస్తాం. - తుహిన్ సిన్హా, జిల్లా ఎస్పీ.

మొక్కుబడిగా రాత్రి గస్తీ

చోరీలను నియంత్రించేందుకు పోలీసులు రాత్రి గస్తీలు నిర్వహిస్తుంటారు. కానీ జిల్లాలో అత్యధిక పోలీసు స్టేషన్ల పరిధిలో రాత్రి గస్తీ మొక్కుబడిగా తంతుగా మారింది. గస్తీ సిబ్బంది బీట్ పుస్తకాలు పట్టుకొని తమకు వీలుగా ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసుకుని అక్కడ నిద్రిస్తున్నారు. మరికొంతమంది పోలీసు సిబ్బంది గస్తీ డ్యూటీలను పక్కనపెట్టి స్థానికంగా ఉన్న లాడ్జీలు, పెట్రోల్ బంకుల్లోని రెస్టరూముల్లో సేదతీరుతున్నారు. సాధారణంగా దొంగల కదలికలపై పోలీసులు కన్నేయాలి. కానీ ఇక్కడ దొంగలే నిఘా పోలీసుల కదలికలపై ... మిగతా 6వ పేజీలో



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీఆర్‌ఓ సత్యనారాయణ

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం వల్లనే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి డీఆర్‌ఓ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో వున్న తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం గాంధీయ మార్గంలో నిరాహారదీక్ష చేసి ప్రాణాలను త్యాగం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ/ వార్డు సచివాలయ అధికారి మంజులావాణి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం విక్రయాలకు రైతులు నిరీక్షణ

» గొలుగొండ మండలంలో ఇంతవరకు ప్రారంభంకాని సేకరణ కేంద్రాలు
» ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్న రైతులు



పాతమల్లంపేటలో నూర్పు అనంతరం ధాన్యాన్ని విక్రయించడానికి సిద్ధం చేసిన రైతు

గొలుగొండ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):

మండలంలో వరి కోతలు చివరి దశకు చేరుకోగా, ముందుగా కోత కోసి పొలాల్లో నూర్చడం కూడా పూర్తయింది. కానీ పౌరసరఫరాల శాఖ అధికారులు ఇంతవరకు ఒక్కచోట కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదు. నూర్చిన ధాన్యాన్ని ఎక్కువ రోజులు కల్లాల్లో వుంచలేక, మద్దతు ధర కన్నా తక్కువ రేటుకు ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

గొలుగొండ మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారు మూడు వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. రావణాపల్లి రిజర్వాయర్, చెరువుల ఆయకట్టుతోపాటు బోర్లు వున్న పొలాల్లో సకాలంలో వరినాట్లు వేశారు. సుమారు నెల రోజుల క్రితం వరి కోతలు ప్రారంభం అయ్యాయి. పాతమల్లంపేట, అమ్మపేట, గొలుగొండ, పప్పుశెట్టిపాలెం, పాకలపాడు, చోద్యం, కృష్ణాదేవిపేట, ఏఎల్‌పురం, విప్పలపాలెం, లింగంపేట, చీడిగుమ్మల గ్రామాల్లో రైతులు ... మిగతా 6వ పేజీలో

ఏయూకి అడ్వయిజరీ బోర్డు?

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మంత్రి నారా లోకేశ్ ప్రకటన



» వర్సిటీకి పూర్వ విద్యార్థులను అనుసంధానం చేసేందుకేనని వెల్లడి
» అభివృద్ధికి సహకారం తీసుకోవడంతోపాటు సలహాలు, సూచనలు తీసుకునే యోచన
» అంతర్జాతీయ స్థాయిలో నిలపడమే లక్ష్యం
» ఏయూ అధికారులు, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ప్రతినిధులతో త్వరలో మంత్రి సమావేశం
» ఏయూకు సంబంధించి కొద్దిరోజుల్లో కీలకమైన ప్రకటన వస్తుందన్న వ్యాఖ్యలపై సర్వత్రా ఆసక్తి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధికి మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. 2026 నాటికి వందేళ్లు పూర్తి చేసుకోబోతున్న ఏయూ అంతర్జాతీయ స్థాయిలో టాప్-100లో నిలిచేలా చేస్తామని పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో చెప్పిన ఆయన...ఈ సందర్భంగా చేసిన మరో ప్రకటనపై వర్సిటీ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. అదే అడ్వయిజరీ బోర్డు ఏర్పాటు...పూర్వ విద్యార్థుల అసోసియేషన్ వ్యవస్థాపకులైన జీఎంఆర్ అధినేత గ్రంథి మల్లికార్జునరావుతో చర్చించి యూనివర్సిటీ అభివృద్ధికి, పూర్వ విద్యార్థులను కనెక్ట్ చేసేందుకు అడ్వయిజరీ బోర్డు ఏర్పాటుచేస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించారు.

వర్సిటీ ప్రగతికి పూర్వ విద్యార్థుల సహకారాన్ని తీసుకోవడంతోపాటు నిరంతరం సలహాలు, సూచనలు ఇచ్చేలా దీనిని ఏర్పాటుచేసే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. జాతీయ వర్సిటీలకు ఈ తరహా బోర్డులు ఉంటాయని, అటువంటి ఆలోచనలోనే ప్రభుత్వం ఉన్నట్టుందంటున్నారు. అందులో భాగంగానే మంత్రి పూర్వ విద్యార్థుల సమావేశం వేదికగా ఈ ప్రకటన చేశారని పేర్కొంటున్నారు. ఈ విషయమై ఆయన కొద్దిరోజుల్లో ఏయూ అధికారులు, పూర్వ విద్యార్థులైన ప్రముఖుల (అసోసియేషన్ ప్రతినిధులు)తో మరో సమావేశాన్ని నిర్వహించవచ్చునంటున్నారు.

ఏయూలో చదువుకున్న సుమారు రెండు నుంచి మూడు లక్షల మంది పూర్వ విద్యార్థులు దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. వీరిలో ఎంతోమంది ఉన్నత స్థానాల్లో ఉన్నారు. అటువంటి వారిని వర్సిటీకి కనెక్ట్ చేయడంతోపాటు అభివృద్ధికి వారి సహకారాన్ని తీసుకోవాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. పూర్వ విద్యార్థుల సహకారంతో వర్సిటీని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టేందుకు ఈ అడ్వయిజరీ బోర్డును ఏర్పాటుచేస్తారని చెబుతున్నారు. ఈ బోర్డులో పూర్వ విద్యార్థులు, ఉన్నత విద్యా శాఖకు చెందిన అధికారులు, ఏయూ అధికారులు ఉండవచ్చునని భావిస్తున్నారు. వర్సిటీకి సంబంధించిన కీలక నిర్ణయాలు ఈ బోర్డులో తీసుకునే వెసులుబాటు కల్పిస్తారంటున్నారు. దీనిపై స్పష్టత రావడానికి కొంత సమయం పడుతుందని చెబుతున్నారు. ఏదిఏమైనా అడ్వయిజరీ బోర్డు గురించి స్వయంగా మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రే ప్రస్తావించడంతో ఈ విషయంపై ప్రస్తుతం వర్సిటీ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది.

కీలక ప్రకటనపై ఆసక్తి

ఇదే సమావేశంలో మంత్రి మరో కీలకమైన వ్యాఖ్య చేశారు. కొద్దిరోజుల్లోనే వర్సిటీ సంబంధించి ముఖ్యమైన ప్రకటన వెలువడుతుందని వెల్లడించారు. అది ఏమై ఉంటుందన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ వంటి అంశాలను ప్రస్తావించిన మంత్రి నారా లోకేశ్...ఆ వెంటనే కీలక ప్రకటన త్వరలో వెలువడుతుందన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద ... మిగతా 6వ పేజీలో

హెల్త్ అసిస్టెంట్లకు ఉద్వాసన

» ఉమ్మడి విశాఖ జిల్లాలో 20 ఏళ్లుగా పని చేస్తున్న ఉద్యోగులు
» కొవిడ్ సమయంలో కుటుంబ సభ్యులను కోల్పోయిన వారు ఎందరో..
» ఉద్యోగాల నుంచి తీసేసి తమను రోడ్డున పడేశారని ఆవేదన



ఆరోగ్య శాఖలో 170 మంది తొలగింపు

విశాఖపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య శాఖలో గత 20 ఏళ్లుగా కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ల తొలగింపు వివాదాస్పదంగా మారుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 1,200 మందిని తొలగించగా, ఇందులో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందినవారు 170 మంది ఉన్నారు. తమను తొలగించడానికి నియామక ప్రక్రియలో ప్రభుత్వం అనుసరించిన విధానమే కారణమని వారు చెబుతున్నారు. అనర్హులైన కొందరు ఉద్యోగాల్లో చేరడంతో అప్పట్లో అర్హులైనప్పటికీ ఉద్యోగాలు దక్కించుకోలేని పలువురు 2013లో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుదీర్ఘకాలం పాటు విచారణ జరిగాక కొద్ది రోజులు కిందట తెలంగాణ హైకోర్టు తీర్పు వెలువరించింది. మంత్రివర్గ ఉపసంఘం మానవతా దృక్పథంతో ఉద్యోగాల్లోకి తీసుకున్న వారిని తొలగించాలంటూ సూచించింది. దీంతో రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులు ఈ ఆదేశాలను రాత్రికి రాత్రే అమలు చేసేశారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా 1,200 మందిని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాల మేరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో పని చేస్తున్న 170 మంది ఉద్యోగాలను కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో వారంతా తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పెద్దలను కలిసి తమ ఉద్యోగాలను తిరిగి ఇప్పించాలని కోరుతున్నారు. అప్పట్లో విధుల్లో చేరిన 1,200 మందిలో 220 మంది మాత్రమే మెరిట్‌లో లేకున్నా ఉద్యోగాలు పొందారని, మిగిలిన వారంతా నిబంధనల ప్రకారం విధుల్లో చేరారని పేర్కొంటున్నారు. 20 ఏళ్లుగా.. మరీ ముఖ్యంగా కరోనా వంటి విపత్కర సమయంలోనూ క్షేత్రస్థాయిలో పనిచేసి ఎంతోమంది ప్రాణాలను కాపాడామని వారు పేర్కొంటున్నారు. కరోనా సమయంలో ఎంతో మంది కుటుంబ సభ్యులను కోల్పోయామని, ఇప్పుడు తమను ఉద్యోగాల నుంచి తొలగించి రోడ్డున పడేశారని వాపోతున్నారు.

ఈ సందర్భంగా ఉద్యోగం కోల్పోయిన శ్రీనివాస్ అనే వ్యక్తి మాట్లాడుతూ.. కొవిడ్ సమయంలో విధుల్లోకి వెళ్లి, రావడం వల్ల వైరస్ బారినపడి కుటుంబ సభ్యులకు వ్యాప్తి చెందేందుకు కారణమయ్యాయని, ఆ సమయంలో తన భార్యతోపాటు అత్తామామలను కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగం వల్ల తాను కుటుంబాన్నే నష్టపోయానని, ఇప్పుడు ఉద్యోగం కూడా కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడిందని విచార వదనంతో తెలిపారు. మానవతా దృక్పథంతో ప్రభుత్వం ఆలోచించి తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఇలాంటి పరిస్థితినే ఎంతోమంది ఎదుర్కొంటున్నారని, వారంతా ప్రభుత్వ పెద్దల చుట్టూ తమను ఆదుకోవాలంటూ తిరుగుతున్నారన్నారు. మరి వీరిపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

పేకాట, కోడిపందేల శిబిరాలపై

పోలీసులు దాడి

» 13 మంది అరెస్టు, రూ.67,600 నగదు, మూడు కోడిపుంజులు స్వాధీనం

ఎస్.రాయవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు వేర్వేరు ప్రదేశాల్లో నిర్వహిస్తున్న పేకాట, కోడి పందేల శిబిరాలపై ఆదివారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. పెదగుమ్ములూరు పంచాయతీ పరిధి సీతారాంపురం గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి పది మంది జూదరులను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.67,000 నగదు, పది మొబైల్ ఫోన్లు, ఏడు బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఇదే మండలం పెదఉప్పలం గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై దాడి చేసి ముగ్గురుని అరెస్టు చేశారు. మూడు పందెం కోళ్లను, రూ.600 నగదును స్వాధీనం చేసుకున్నారు. పేకాట, కోడి పందేలు ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు జూదాలు నిర్వహిస్తున్న ప్రదేశాల్లో మాటు వేసి దాడులు నిర్వహించినట్టు పోలీసులు వెల్లడించారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరచు న్నట్టు తెలిపారు.



విశాఖలో ఉత్సాహంగా నేవీ మారథాన్

మారథాన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు

విశాఖపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో ఆదివారం విశాఖ బీచ్ రోడ్డులో నేవీ మారథాన్ ఆదివారం ఉత్సాహంగా జరిగింది. కలెక్టర్ హరేంధిరప్రసాద్, తూర్పు నావికాదళ ప్రధాన అధికారి రాజేశ్ పెంధార్కర్, నగర సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చిలు జెండా ఊపి ప్రారంభించారు. 42 కె, 21 కె, 10 కె, 5 కె మారథాన్‌లో దేశ విదేశాల నుంచి సుమారు 15 వేల మంది పాల్గొన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

పాటిపల్లిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మునగపాక, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వపు విద్యార్థులు ఆదివారం పాటిపల్లి నృసింహ స్వామి ఆలయం వద్ద ఆత్మీయ సమావేశమ య్యారు. సుమారు 30 సంవత్సరాలు క్రితం పదో తరగతి పూర్తి చేసిన వారంతా ఏటా పిక్నిక్ ఏర్పాటు చేసుకుంటున్నారు. జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ కూడా ఆ బ్యాచ్‌కు చెందిన వ్యక్తి కావడంతో ఆయన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడిగా గడిపారు.

ప్రశ్నార్థకంగా శాంతిభద్రతలు

... 5వ పేజీ తరువాయి

కన్నేసి, వారు పర్యటించని ప్రదేశాల్లో నేరాలకు పాల్పడుతున్నారు.

నెల వారీ మామూళ్లు!

జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో అధికారులు, సిబ్బంది శాంతిభద్రతల కన్నా మామూళ్ల వసూళ్లపైనే శ్రద్ధ చూపుతున్నారు. రహదారుల పక్కనున్న దాబాలు, హోటళ్లు, రెస్టారెంట్లలో అనధికారికంగా మద్యం విక్రయాలు, మద్యపానం వంటివి జరుగుతున్నప్పటికీ పోలీసులు దాడులు చేయడం లేదు. వీటి వద్ద రోడ్డుపై వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నప్పటికీ పట్టించుకోవడంలేదు. వీటి నిర్వాహకుల నుంచి నెల వారీ మామూళ్లు వసూలు చేస్తుండడమే ఇందుకు కారణమని తెలిసింది. ఎస్.రాయవరం, కోటవురట్ల, ఎలమంచిలి మండలాల సరిహద్దు గ్రామాల్లో వున్న తోటల్లో పేకాట, కోడిపందేలు నిత్యకృత్యం అయ్యాయి. ముఖ్యంగా పేకాట డెన్‌లు నిర్వహించే వ్యక్తులతో స్థానిక పోలీసులు లాలూచీ పడి, స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. ఈనెల 13వ తేదీన ఎస్.రాయవరం మండలం ధర్మవరం అగ్రహారం శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై స్థానిక పోలీసులు కాకుండా స్పెషల్ బ్రాంచి పోలీసులు దాడి చేయడం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నది. పేకాట డెన్‌పై స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసూర్యారావు, ఎలమంచిలి రూరల్ ఎస్ఐ ఉపేంద్ర ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది దాడి చేసి 27 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని, రూ.1,89,000 నగదు, 18 మొబైల్ ఫోన్లు, 12 బైకులను స్వాధీనం చేసుకున్న తరువాతే స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు.

పోలీసు స్టేషన్‌లలో సివిల్ సెటిల్‌మెంట్‌లు

జిల్లాలోని కొన్ని పోలీస్ స్టేషన్లు సివిల్ సెటిల్‌మెంట్‌లకు అడ్డాగా మారిపోయాయి. కొన్ని పోలీసు స్టేషన్‌ల ముఖద్వారం వద్ద 'సివిల్ తగాదాలు ఇచ్చట పరిష్కరించబడవు' అనిఇ బోర్డులు పెట్టి వుంటాయి. కానీ అత్యధిక సెటిల్‌మెంట్‌లు ఇక్కడే జరుగుతుంటాయి. ఆస్తుల వివాదాల్లో వాస్తవంగా పోలీసులు తలదూర్చకూడదు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. కానీ ఆస్తుల వివాదాల్లో ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికి కొమ్ము కాస్తూ, అవతల వ్యక్తులను బెదిరించి, ఇబ్బందులకు గురి చేస్తున్నారు,

చాపకింద నీరులా గంజాయి వినియోగం

ఏజెన్సీ నుంచి అనకాపల్లి జిల్లా మీదుగా పలుమార్గాల్లో గంజాయి రవాణా అవుతున్న విషయం అందరికీ తెలిసింది. గంజాయి రవాణాను వైసీపీ ప్రభుత్వ కట్టడి చేయకపోగా, స్మగ్లర్లకు ఆ పార్టీ నేతలు సహకరించడంతో గంజాయి రవాణా, వినియోగం భారీగా పెరిగిపోయాయి. ఏజెన్సీ నుంచి జిల్లాలోకి ఏయే మార్గాల్లో గంజాయి రవాణా అవుతుందో పోలీసులకు తెలిసినప్పటికీ మాఫియా నుంచి భారీగా డబ్బులు ముడుతుండడంతో తమ స్టేషన్ పరిధిలో నుంచి సురక్షితంగా తరలేలా సహకరిస్తున్నారని నిక్కచ్చిగా పనిచేసే పోలీసు అధికారులే చెబుతున్నారు. జిల్లాలో నేరాలు పెరిగిపోవడానికి గంజాయి ప్రధాన కారణమని అంటున్నారు.

గోవాడ షుగర్స్‌లో క్రషింగ్ సీజన్‌కు శ్రీకారం

... 5వ పేజీ తరువాయి

నిర్ణయించిన ముహూర్తానికి బాయిలర్ వద్ద పూజలు నిర్వహించిన అనంతరం ఎండీ వి.సన్యాసినాయుడు బాయిలర్ వెలిగించి క్రషింగ్ సీజన్‌కు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ, గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్‌ను ఈ నెల 25వ తేదీన ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. ఓవర్‌హాలింగ్ పనులు దాదాపు పూర్తికావచ్చాయని, క్రషింగ్ సజావుగా సాగేందుకు చెరకు రైతులు, కార్మికులు సహకారం అందించాలని ఆయన కోరారు.

ఏయూకు అడ్వయిజరీ బోర్డు?

... 5వ పేజీ తరువాయి

విశ్వవిద్యాలయం కావడంతో ఏయూకు మంత్రి నారా లోకేశ్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఉపయోగపడే ప్రకటన రావచ్చునన్న ఆశాభావాన్ని వర్సిటీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. 'ఆ హబ్' పేరుతో ఇప్పటికే స్టార్టప్ సెంటర్, మరికొన్ని ఇంక్యుబేషన్ సెంటర్లు ఏయూలో ఉన్నాయి. ఈ తరహాలో మెగా సెంటర్ ఒకటి ఏర్పాటుచేసే ఆలోచనలో మంత్రి ఉన్నారని, దీనిని రాష్ట్రంలోని అన్ని సెంటర్లకు కేంద్రంగా ఏయూలో పెట్టే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

ధాన్యం విక్రయాలకు రైతులు నిరీక్షణ

... 5వ పేజీ తరువాయి

పది రోజుల నుంచి వరి నూర్పులు చేస్తున్నారు. జిల్లాలో 72 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, వీటిలో మూడు.. గొలుగొండ, ఏఎల్‌పురం, చీడిగుమ్మలు గ్రామాల్లో ప్రారంభిస్తామని ఈనెల ఆరంభంలోనే అధికారులు ప్రకటించారు. తొమ్మిదో తేదీ నుంచి ధాన్యం సేకరణ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. కానీ వారం రోజులు అవుతున్నప్పటికీ గొలుగొండ మండలంలో ఇంతవరకు ఒక్క కొనుగోలు కేంద్రాన్ని కూడా ప్రారంభించలేదు. వరి కుప్పలు నూర్చి రెండు నుంచి మూడు వారాలు అవుతున్నప్పటికీ ప్రభుత్వ పరంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో పలువురు రైతులు పండించిన ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. మద్దతు ధర కన్నా తక్కువ రేటుకు అమ్ముకోవాల్సి వస్తున్నదని వాపోతున్నారు. కాగా మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంపై వ్యవసాయాధికారి సుధావాణిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, గొలుగొండ మండలంలో ధాన్యం కొనుగోళ్ల బాధ్యతను రోలుగుంట మండలానికి చెందిన రైతు ఉత్పత్తి సహకార సంస్థకు ప్రభుత్వం అప్పగించిందని, ధాన్యం సేకరణ కోసం సిబ్బందిని నియమించి శిక్షణ కూడా ఇచ్చామన్నారు. ఈ వారంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేలా చర్యలు చేపడతామని చెప్పారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	103.00
లైవ్ ధర	123.00
విత్ స్కిన్	216.00
స్కిన్ లెస్	226.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	620
విజయనగరం	624
శ్రీకాకుళం	624

ఎన్నాళ్లీ కష్టాలు...?

- శారదా నదిని దాటేందుకు వైలోవ గ్రామస్థుల అవస్థలు
- పాత బోటు ఎక్కి తాడు లాగుకుంటూ నదిని దాటుతున్న గ్రామస్థులు
- నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలని వేడుకోలు

రాంబిల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైలోవ ప్రజలు గ్రామానికి ఆనుకొని ఉన్న శారదా నదిని దాటేందుకు నానా కష్టాలు పడుతున్నారు. సుమారు రెండు వేలకు పైగా జనాభా కలిగిన ఈ గ్రామంలో ప్రజలు పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అయితే వీరి పంట పొలాలు, పశువుల పాకలు, నది అవతల ఉండడంతో ప్రతి రోజు పుట్టి, పడవ సాయంతో నదిని దాటుతూ వెళుతుంటారు. ఆటుపోటులు లేని సమయంలో నదిలో నీటి ఉధృతి తక్కువగా ఉన్న సమయంలో పశువులను నదిని అతికష్టం మీద దాటిస్తూ వ్యవసాయ పొలాలకు మేపేందుకు తీసుకువెళుతుంటారు.



శారదా నది వద్ద వంతెన నిర్మించాల్సిన ప్రదేశం ఇదే



పొలాలకు వెళ్లేందుకు పడవ ద్వారా తాడు పట్టుకొని నదిని దాటుతున్న రైతు

నదిలో నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న సందర్భాల్లో పొలాలు, పశువుల పాకల వద్దకు వెళ్లేందుకు పుట్టి, పడవ సహాయంతో తాగు లాగుకుంటూ అతికష్టంతో నదిని దాటాల్సిన పరిస్థితి ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. నదిలో నీటి ఉధృతి అధికంగానే ఉంటుందని, నదిని దాటే సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని నిత్యం భయాందోళన చెందుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు, వృద్ధులు ఈ నది దాటేందుకు మరింత భయపడుతున్నారు. గతంలో ఎమ్మెల్యేలుగా ఉన్న యూవీ.రమణమూర్తిరాజు, పంచకర్ల రమేష్‌బాబులు ఈ నది వద్ద పరిస్థితిని పరిశీలించి, వంతెన ఏర్పాటుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారని, నేటికీ నెరవేరలేదని వారు వాపోయారు. ప్రస్తుత ఎమ్మెల్యే సుందరపు విజకుమార్, అధికారులు స్పందించి ఈ నదిపై రాకపోకలు సాగించేందుకు వంతెన నిర్మాణం చేపట్టేలా చర్యలు చేపట్టాలని వైలోవ గ్రామస్థులు కోరుతున్నారు.

పూడిమడకలో చెత్త గుట్ట!

- నిర్వహణను పట్టించుకోని అధికారులు
- కుళ్లిపోయి తీవ్ర దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది
- నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రం

అచ్యుతాపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో మేజర్ పంచాయతీ పూడిమడకలో పారిశుధ్యం లోపించింది. వీధుల్లో, ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను లోవపాలెం వెళ్లే రోడ్డులో సంపద తయారీ కేంద్రం పక్కన పడేస్తున్నారు. దీంతో చెత్తాచెదారం గుట్టలా పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వస్తున్నది.

పూడిమడక పంచాయతీలో పూడిమడకతోపాటు కడపాలెం, కొండపాలెం, ఎస్‌సీకాలనీ, పెద్దూరు, పల్లిపేట, జాలారిపేట గ్రామాలు వున్నాయి. మొత్తం జనాభా సుమారు 18 వేలు. రోజూ టన్నుకు పైగా చెత్త పోగవుతుంది. గత టీడీపీ హయాంలో సీఎస్ఆర్ నిధులతో బ్రాండిక్స్ యాజమాన్యం ఇచ్చిన వ్యాన్ల ద్వారా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు ఇవ్వకపోవడంతో వారు విధులకు రావడం మానేశారు. అప్పటి నుంచి



పూడిమడకలో పేరుకుపోయిన చెత్త



నిరుపయోగంగా పడివున్న సంపద తయారీ కేంద్రం

పంచాయతీలో సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రం పక్కన డంపింగ్ చేస్తున్నారు. చెత్త నిర్వహణను పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో పెద్ద గుట్టలా తయారైంది. చెత్త కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతున్నది. వర్షం కురిస్తే పరిస్థితి మరింత దారుణంగా వుంటుంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి ప్రజలు భయపడుతున్నారు. దోమలు విపరీతంగా పెరిగి ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయి. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి దుర్వాసన బారి నుంచి తమను కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొండకర్ల ఆవ వద్ద పర్యాటకుల సందడి

అచ్యుతాపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొండకర్ల ఆవ వద్ద ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు అవడంతో జిల్లా నలుమూలల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. కొంతమంది ఇక్కడి వాహనాలపై భోజనాలు తెచ్చుకోగా, మరి కొందరు ఇక్కడ వంటలు చేసుకొన్నారు. కొండకర్ల ఆవతో పడవలపై ప్రయాణం చేయడం ఎంతో ఆహ్లాదాన్నిస్తుంది. కొండకర్ల ఆవలో కొంతదూరం వరకు తేలే వంతెన ఉంటుంది. అలాగే ఆవ మధ్యకు వెళ్లే వరకు తామర ఆకులు, పూలు ఉంటాయి. వీటి మధ్య నుంచి పడవపై వెళ్లడం ప్రత్యేక అనుభూతి కలుగుతుంది. చాలా మంది పర్యాటకులు ఆదివారం పడవలపై ప్రయాణం చేసి ఆనందించారు.



ఆవలో పడవలపై విహారం చేస్తున్న పర్యాటకులు

ఘనంగా పరదేశమ్మ బోనాల ఉత్సవం



బోనాలను తీసుకువెళుతున్న భక్తులు

ఎలమంచిలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని యర్రవరంలో ఆదివారం పరదేశమ్మ అమ్మవారి బోనాల పండుగ అంగరంగ వైభవంగా జరిగింది. వందలాది భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. జాతరను పురస్కరించుకుని ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు తమ ఇళ్ల వద్ద తయారుచేసిన పిండి వంటలను అమ్మవారికి సారెగా సమర్పించారు. వందలాది భక్తుల మధ్య అమ్మవారిని పల్లకిలో గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త పిట్టా శ్రీనివాస్, పరదేశమ్మ భవానీల పీఠం, దుర్గమ్మ భవానీల పీఠం భక్తులంతా కలిసి సారె ఉత్సవంలో పాల్గొన్నారు



అమ్మవారిని పల్లకిలో ఊరేగిస్తున్న భవానీ భక్తులు

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ఎలమంచిలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. దిమిలి రోడ్డు జంక్షన్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి మునిసిపల్ వైస్ చైర్మన్ ఆరైపు గుప్తా, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్ర అవతరణలో పొట్టి శ్రీరాములు త్యాగ నిరతిని పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, పలువురు వ్యాపారస్థులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

మండలంలోని చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దాయ్ వల్లభాయి పటేల్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు, పటేల్ చిత్రపటాలకు గ్రంథాలయాధికారి కె.



నక్కపల్లి: పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయి పటేల్ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

జనార్దన్, తెలుగు పండిట్ ఎన్‌వీఎస్ ఆచార్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతి



ఎలమంచిలి: పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైస్ చైర్మన్ గుప్తా, ఆర్యవైశ్యులు

థిగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రిటైర్డ్ టీచర్ శ్రీపాద సత్యదేవ శర్మ పాల్గొని జాతి నాయకుల గొప్పతనం కోసం వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సతీశ్, సిబ్బంది రమణమ్మ పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి

- ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ పి.ప్రసాద్

పాయకరావుపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లల్లో స్టార్ రేటింగ్ ఉన్న గృహోపకరణాలు ఉపయోగించి విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ పి.ప్రసాద్ అన్నారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పాయకరావుపేట స్త్రీశక్తి భవన్‌లో డ్వాక్రా మహిళలు, ప్రజలకు విద్యుత్ పొదుపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు ఇంధన సంరక్షణ పద్ధతులపై అవగాహన పెంచుకుని ఏసీ, ఫ్రిజ్, కూలర్ తదితర స్టార్ రేటింగ్ గల గృహోపకరణాలు వాడుకోవాలన్నారు. దీని వలన వినియోగదారులకు నెలనెలా విద్యుత్ బిల్లులు తగ్గుతాయన్నారు. ఇలా చేయడం వల్ల అందరికీ నాణ్యమైన విద్యుత్‌ను అందించవచ్చన్నారు. అనంతరం అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ మాట్లాడుతూ డిస్కమ్‌ల



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఈపీసీఎల్ ప్రతినిధి

ద్వారా శక్తి సంరక్షణ, శక్తి సామర్థ్య కార్యకలాపాల ప్రాముఖ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏఓ సీహెచ్ఆర్‌కే.వర్మ, విద్యుత్‌శాఖ పాయకరావుపేట, నక్కపల్లి ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

పూడిమడక తీరానికి తాబేలు కళేబరం



పూడిమడక తీరానికి కొట్టుకు వచ్చిన తాబేలు కళేబరం

అచ్యుతాపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పూడిమడక తీరానికి తాబేలు కళేబరం ఆదివారం ఉదయం కొట్టుకువచ్చింది. దీంతో మత్స్యకారులు ఆందోళనకు గురవుతున్నారు. ఈనెలలో ఈ విధంగా తాబేలు కళేబరాలు కొట్టుకురావడం ఇది రెండోసారి. తాబేళ్లతోపాటు చేపలు కూడా చనిపోతున్నాయి. కర్మాగారాల నుంచి విడుదలైన వ్యర్థాలు సముద్రంలో కలియడం వల్లే చేపలతోపాటు తాబేళ్లు చనిపోతున్నాయని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఏపీఐఐసీ అధికారులతోపాటు, మత్స్యశాఖ, కాలుష్య నివారణ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేశారు. అధికారులు తనిఖీలకు వస్తున్నా చర్యలు చేపట్టడం లేదు. దీంతో తాబేళ్లు, చేపలు చనిపోతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోకపోతే తమ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఘనంగా ఖాదర్ వలీ ఉర్సు



గుర్రంపై ఊరేగింపు చేపడుతున్న దృశ్యం

నక్కపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబోదిగల్లం గ్రామంలో ముస్లిం సోదరులు ఖాదర్ వలీ ఉర్సును ఘనంగా జరుపుకున్నారు. ముందుగా మసీద్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉర్సు పండుగ విశిష్టత గురించి మత పెద్దలు వివరించారు. బావుటాలు ఎగురవేసి, గుర్రంపై ఊరేగింపు చేశారు. దర్గాలో నమాజ్ చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం ఏర్పడింది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



అచ్యుతాపురంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అచ్యుతాపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో 1998-99లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక ఒక లేఅవుట్‌లో కలుసుకున్నారు. వీరంతా ఒకరి నొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. కుటుంబాలతో సహా వచ్చి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.

పేదోళ్లకు భరోసా తెలుగుదేశం పార్టీ

- మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు



టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న శ్రీను, తదితరులు

మునగపాక, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పేదోళ్లకు భరోసాగా నిలుస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని తోటాడ గ్రామంలో జరిగిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భావం చెంది నాలుగు దశాబ్దాలు దాటినా ప్రజల్లో అభిమానం, విశ్వాసం తరగలేదన్నారు. వంద రూపాయలతో సభ్యత్వం తీసుకునే సభ్యుడికి రూ.5లక్షల మేర బీమా భరోసా కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు దొడ్డి రమేష్, ఆవకాలువ చైర్మన్ ఆడారి ఆనంద్ సన్యాసినాయుడు, పొలమరశెట్టి మురళి, చదరం భాస్కరరావు, పెంటకోట గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి వేడుకలు



తోటాడలో గీతా జయంతి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

మునగపాక, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో తోటాడ గ్రామంలో ఆదినారాయణస్వామి రాజయోగ ఆశ్రమంలో ఆదివారం గీతా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 15 వారాలుగా ఆశ్రమంలో పిల్లలకు శ్లోకాలపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. భగవద్గీత పఠనం, వినడంపై గ్రామంలో ఇంటింటికి ప్రచారం చేశామన్నారు.

నేడు ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఎలమంచిలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక జరుగుతుందని ఎంపీడీఓ కేఎస్. కొండలరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయకుమార్ హాజరవుతున్నారని, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

తొమ్మిదోసారి తిరుపతికి పాదయాత్ర

- భక్తిభావం చాటుకుంటున్న పిల్లి సూర్యనారాయణ



పాదయాత్ర ద్వారా తిరుపతి బయలుదేరిన భక్తులు

మునగపాక, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో వాడ్రాపల్లి గ్రామానికి చెందిన పిల్లి సూర్యనారాయణ కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు తిరుపతికి తొమ్మిదవసారి పాదయాత్ర మొదలు పెట్టారు. ఆదివారం వాడ్రాపల్లిలోని వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని అక్కడ నుంచి మళ్ల త్రినాథరావుతో కలిసి పాదయాత్రకి శ్రీకారం చుట్టారు. వైకుంఠ ఏకాదశి నాటికి తిరుమల కొండపైకి చేరే విధంగా ప్రణాళిక చేసుకున్నామని చెప్పారు.


విలేకరులతో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పక్కన నాయకులు

ఏఎల్‌పురం అభివృద్ధికి కృషి

▸ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ ఏఎల్‌పురం గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గ్రామంలో ఓ కల్యాణ మండలం ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ పాలనలో ఏఎల్‌పురాన్ని దత్తత తీసుకుని కోట్లాది రూపాయలతో బస్‌స్టేషన్, సీసీ రోడ్లు, పశు వైద్యశాల, అంగన్‌వాడీ భవనాలు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరిపార్కు తదితర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మరలా టీడీపీకి ప్రజలు పట్టం కట్టడంతో అల్లూరి పార్కుతో పాటు గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే గ్రామానికి సీసీ రోడ్డు, ఇతర అభివృద్ధి పనుల కోసం రూ.కోటి మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్, మాజీ సర్పంచ్ కుందూరు అప్పారావు, నాయకులు పెట్ల నారాయణమూర్తి, బొడ్డు జమీలు, గొంప వాసు, బొలిశెట్టి పాపారావు, చైర్మన్లు రాజులునాయుడు, స్వామినాయుడు, వాసవీ, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

పరీక్షల సమయంలో శిక్షణ ఇవ్వడం సరికాదు

▸ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చినబ్బాయి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమ్మేటివ్ పరీక్షలు జరుగుతున్న సమయంలో ఉపాధ్యాయులకు నాయకత్వ శిక్షణా తరగతుల పేరుతో విజయనగరం జిల్లాలో శిక్షణ ఇవ్వడం సరికాదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి పేర్కొన్నారు. సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో విద్యా శాఖ అధికారుల వైఖరిని నిరసించారు. సమావేశం ప్రారంభంలో ఇటీవల మరణించిన టీచర్స్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చినబ్బాయి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు సమ్మేటివ్ పరీక్షలు జరుగుతున్నాయని, ఇలాంటి సమయంలో ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహించడం సరికాదని పేర్కొన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు ఎక్కువగా ఉన్నాయని, ఇటువంటి తరుణంలో ఉపాధ్యాయులను శిక్షణా తరగతుల్లో నిమగ్నం చేస్తే పాఠశాలల్లో పిల్లలకు పరీక్షలు ఎవరు నిర్వహిస్తారని ఆయన ప్రశ్నించారు. పరీక్షలు పూర్తయిన రెండు రోజుల్లో పేపర్లు దిద్ది ఆన్‌లైన్‌లో మార్కులు నమోదు చేయాలని అధికారులు ఆదేశించారన్నారు. ఈ సమయంలో శిక్షణ పేరుతో పాఠశాలకు వారం రోజులు దూరం చేయడం సరికాదని చెప్పారు.

రీ సర్వేలో తొలగించిన ఎల్‌సీసీ పట్టాలను పునరుద్ధరించాలి

▸ రామన్నదొరపాలెం గిరిజనుల ఆందోళన


హక్కు పట్టాలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

రావికమతం, డిసెంబరు 15, (ఆంధ్రజ్యోతి): జగనన్న రీ సర్వేలో ఆర్‌వోఆర్ రికార్డుల్లో తొలగించిన తమ పట్టాలను పునరిద్ధరించాలని కోరుతూ రామన్నదొర పాలెం, గదబపాలెం గిరిజనులు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె. గోవిందరావు మాట్లాడుతూ, మండలంలో కొట్నాబిల్లి పంచాయతీ శివారు రామన్నదొరపాలెం, గదబపాలెం గ్రామాలకు చెందిన 30 గిరిజన కుటుంబాలకుకొట్నాబిల్లి రెవెన్యూలో 35 ఎకరాలున్నాయి. 1975-1988 సంవత్సరాల్లో ఈ భూముల్లో సాగులో ఉన్న వీరందరికి అప్పటి ప్రభుత్వం డీపట్టాలు మంజూరు చేశారు. రికార్డులో అడంగల్ సాగుదారులుగా నమోదు చేశారు. అప్పటి నుంచి గిరిజనులు సదరు భూములను సాగుచేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. జగనన్న రీ సర్వేకి వచ్చిన రెవెన్యూ అధికారులకు తమ వద్ద నున్న పట్టాదారు పుస్తకాలు హక్కు పత్రాలు సమర్పించామన్నారు. ఈ సర్వే తరువాత గిరిజనుల భూములకు సంబంధించిన వివరాలు, తమ పేర్లు రికార్డుల్లో కనించలేదని వాపోయారు. దీంతో బ్యాంకులో తీసుకున్న రుణాలకు పట్టాదారు, వన్‌బీ అడంగల్ ఇస్తేనే రుణం రెన్యువల్ చేస్తామని, లేకుంటే తీసుకున్న రుణం పూర్తిగా చెల్లించాలని బ్యాంకు అధికారులు ఒత్తిడి చేస్తు న్నారన్నారు. సమస్యపై అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారం కాలేదని అన్నారు. గత ఫిబ్రవరిలో ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరావుకు ఫిర్యాదు చేశామన్నారు. ఆయన దర్యాప్తు చేయాలని ఎస్టీ కమీస్ ఆదేశించారన్నారు. దీంతో అప్పటి జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలించి గత మార్చి 14న గిరిజనులు సాగులో ఉన్న ఈ గిరిజనులందరికీ పట్టాలు మంజూరు చేయాలని కలెక్టర్‌కు నివేదిక పంపించారన్నారు. ఇటీవల జరిగిన రెవెన్యూ గ్రామ సభలో మళ్లీ తమ పేర్లు వెబ్ ల్యాండ్‌లో నమోదు చేయాలని గిరిజనులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు ఇచ్చారన్నారు. అయిన ఇప్పటి వరకూ ఏ విధమైన చర్యలు చేపట్టలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు అరిగిల అచ్చన్న, దోని అర్జున, గోరా పెద్దిరాజు, అప్పిలి దేవుడు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

▸ 180 మంది రోగులకు రక్త పరీక్షలు


శిబిరంలో రోగులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నాతవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో గైనకాలజిస్టు నివేదిక, ఆర్థోపెడిక్ శ్రీజన, జనరల్ ఫిజిషియన్ పావని తదితరులు 180 మందికి రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా శిబిరం నిర్వాహకులు పైల వెంకటరమణ మాట్లాడుతూ వచ్చే ఏడాది మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. జనవరిలో జిల్లా స్థాయి వాలీబాల్, క్రికెట్ పోటీలు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత మండల అధ్యక్షులు శెట్టి నానాజీ, నాయకులు చింతకాయల శ్రీనువాసు, శెట్టి నానాజీ, శెట్టి గోపి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ చిటికెల శ్రీను పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు


శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని పలు మండలాల్లో పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. నర్సీపట్నం కొత్తవీధి సమీపంలోని పెదబొడ్డేపల్లి పెద్ద చెరువు వద్ద ఉన్న శ్రీరాములు విగ్రహానికి మునిసిపల్ చైర్‌పర్సన్ బి.సుబ్బలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమర జీవిగా ప్రజల హృదయాలలో నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం, నాయకులు విజయ్, ఏకా శివప్రసాద్, పిట్ల నాయుడు, తమరాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గొలుగొండ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఆంధ్రుల ఐక్యత కోసం పోరాడిన పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే అమర జీవి జీవిత చరిత్రను గ్రంథాలయాధికారి రాజబాబు విద్యార్థులకు వివరించారు.

కృష్ణాదేవిపేట: ఏఎల్‌పురం పంచాయతీ కార్యాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సర్పంచ్ సుజాత మాట్లాడుతూ తుదిశ్వాస వరకు ఆంధ్రుల ఐక్యత కోసం పోరాడి తెలుగు వారి అస్తిత్వాన్ని ఎలుగెత్తి చాటి చెప్పిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు చింతల బుల్లిప్రసాద్, టీడీపీ నాయకులు బొడ్డు జమీలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

మాకవరపాలెం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1991-92 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. రాచపల్లి జంక్షన్‌లో ఉన్న కామేశ్వరమ్మ ఆలయం వద్ద ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి వారంతా ఎంతో ఆనందంగా గడిపారు. నాటి జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. కుటుంబ యోగక్షేమాలు, స్థితిగతులను అడిగి తెసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఏటా డిసెంబరు రెండో వారంలో పూర్వ అందరూ కలుసుకోవాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఇందులో భాగంగానే ఆదివారం కలయిక నిర్వహించమన్నారు. అలాగే వారు చదువుకున్న సమయంలోని ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. 60 మందికి పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. బాలాజీ, శ్రీను, నూకరాజు తదితరులు ఏర్పాట్లు చేశారు.

మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ నూతన కార్యవర్గం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా మలేరియా శాఖ కార్యాలయంలో ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్షులుగా కె.గీతారాణి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెండ్లుగా ఎస్.లక్ష్మణరావు, సిహెచ్.శ్రీనివాసబాబు, టి.హిమబిందు, సుజాత ఎన్నికయ్యారు. అలాగే కార్యదర్శిగా ఎం.సూర్యశంకరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.అప్పలరాజు, జాయింట్ సెక్రటరీలుగా రాజాబాబు, ఎం.అప్పలరాజు, డి.వెంకట్ సుధీర్‌కుమార్, బి.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ (ఉమెన్) వీవీ వరలక్ష్మి, పద్మావతిదేవి, కోశాధికారిగా వి.చంద్రశేఖర్, ఈసీ సభ్యులుగా టి.ఉమామహేశ్వరి, కె.మహావిష్ణు ఎన్నికయ్యారు. రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు తిరుపతిబాబు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎన్‌వీఆర్ కిశోర్, దురాణి, విశాఖపట్నం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి ఎస్.ఈశ్వరరావు, మాజీ అధ్యక్షుడు కేవీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు సహకరించండి

▸ చోడవరం అటవీశాఖ రేంజి అధికారి రవివర్మ


అధికారి రవివర్మ

చోడవరం, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అందరూ సహకారం అందించాలని స్థానిక అటవీశాఖ రేంజి అధికారి పి.వి. రవి వర్మ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన స్థానికవిలేకరులతో మాట్లాడుతూ, డిసెంబరు నెల నుంచి మే నెల వరకూ అడవుల్లో అగ్ని ప్రమాదాలకు ఎక్కువ ఆస్కారం ఉంటుందని, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం వెళ్లేవారితో పాటు, అటవీ ప్రాంతాల్లో సరదాకోసం వచ్చే వారు అవగాహన లేక నిర్లక్ష్యంగా సిగరెట్లు, చుట్ట, బీడీ తదితర వాటిని కాల్చి నిర్లక్ష్యంగా పారవేయడం వల్ల మంటలు అంటుకుని అడవులు నాశనమయ్యే ప్రమాదం ఉంటున్నదని హెచ్చరించారు. ఈ స్థితిలో అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణపై స్థానికులకు అవగాహనకు వివిధ ప్రాంతాల్లో సమావేశాల నిర్వహణతో పాటు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పంచాయతీల కార్యదర్శులు, వనసంరక్షణ సమితి సభ్యులు సహకారం అందించాలని కోరారు.

టోల్ ఫ్రీ నంబర్లు

అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినట్లయితే టోల్ ఫ్రీ నంబరు 1800-425-5909 తో పాటు, అటవీ రేంజి అధికారి, చోడవరం 9441469400 లేదా, డిప్యూటీ రేంజి అధికారి ఫోన్: 9491872256, ఫారెస్టు సెక్షన్ అధికారి 9493434910 సమాచారం అందించాలని రవి వర్మ విజ్ఞప్తి చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం


నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కె.కోటపాడు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనందపురం గ్రామంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి నిర్వహించింది.64 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. 30 మందికి ఆపరేషన్లకు ఎంపిక చేసి విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి బస్సులో తరలించారు. శంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణులు డాక్టర్ అరుణ, క్యాంపు మేనేజర్ అరుణ్‌కుమార్ ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు, సర్పంచ్ వంటాకు అప్పాజీ, దుర్గ సత్యనారాయణమూర్తి, సూరెడ్డి బాబురావు, భోజంకి సూర్యనారాయణ, సింగంపల్లి అర్జున తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

దేవరాపల్లి, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి) పంచాయతీలు ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి, పరిపాలనా విధులపై నాలుగు రోజులపాటు శిక్షణ తరగతులునిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సువర్ణరాజు ఆదివారం తెలిపారు. ఈనెల 16, 17 మండల స్థాయి అధికారులకు, 18, 19 తేదీలలో, కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి, సర్పంచ్‌లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా నూకాలమ్మ పండగ


అమ్మవారికి పూజలు


నూకాలమ్మ ఆలయం ఎదుట బారులతీరిన భక్తులు

రావికమతం, డిసెంబరు 15, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడివాడ నూకాలమ్మ తల్లి వార్షిక పండగను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈసందర్భంగా తెల్లవారు జామునుంచే భక్తులు అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. పసుపు కుంకుములతోపాటు చీరలు, జాకెట్లు, గాజులు తదితర కానుకలు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఏటా ఈనెలలో అమ్మవారి వార్షిక పండగను గ్రామస్తులు అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. గ్రామంలో ఒకే చోట అమ్మవారికి రెండు వేర్వేరు ఆలయాలుండడం విశేషం. ఆలయంలో ఆది వారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు అభిషేకాలను నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమది అమ్మవారి ఘటాలను ఇళ్లవద్ద పూజించి వాటిని నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వంటావార్పు చేసుకొని వన భోజనాలు చేశారు.

ముగిసిన దత్తాత్రేయ సప్తాహ మహోత్సవాలు

మాడుగుల రూరల్: మండలంలోని వీరవిల్లి అగ్రహారంలో అర్చకుడు శ్రీనివాస భరణి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన దత్తాత్రేయ సప్తాహ మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. వారం రోజులపాటు వేకువజాము నుంచి భక్తులు స్వామివారి నామాన్ని జపిస్తూ , భజనలు ఏకాహం చేశారు. ఆదివారం చివరి రోజున హోమ పూజలు జరిపించి అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు. పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం దత్తాత్రేయస్వామి వారికి పల్లకి సేవ చేపట్టి వీధుల్లో ఊరేగించారు.

మోదకొండమ్మకు పూజలు

మాడుగుల: స్థానిక మోదకొండమ్మ అమ్మవారి


ఘటాలతో మోదకొండమ్మ ఆలయానికి వెళ్తున్న భక్తులు

నేటి నుంచి ధనుర్మాస పూజలు


భూదేవి నీలాదేవి సమేత కేశవస్వామి

కె.కోటపాడు: ధనుర్మాసం సోమవారం నుంచి ప్రారంభమవ్వడంతో మండలంలోని మేడచెర్ల గ్రామంలోని శ్రీ భూదేవి నీలాదేవి సమేత కేశవస్వామి ఆలయం పూజలకు సిద్ధమైంది. సోమవారం నుంచి ప్రతి రోజూ తెల్లవారు నాలుగు గంటలకు స్వామివారి సుప్రభాత సేవ, పల్లకి సేవ అనంతరం నగర సంకీర్తన జరుగుతుంది. జనవరి 13వ తేదీ భోగి వరకు ఈ పూజా కార్యక్రమాలు ఉంటాయి. జనవరి 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని అర్చకులు తాతా వెంకటరమణమూర్తిశర్మ తెలిపారు.

కారును ఢీకొన్న అగ్నిమాపక వాహనం

మాడుగుల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాల వినాయకుడు మూడురోడ్ల జంక్షన్‌లో ఆదివారం మధ్యాహ్నం కారుకి అగ్నిమాపక వాహనం ఢీకొంది. కారు మలుపువద్ద పార్కింగ్ చేయడంతో ఖండివరం నుంచి మాడుగులు వస్తున్న అగ్నిమాపక వాహనం మలుపు తిప్పే క్రమంలో దీనిని ఢీకొంది. కారు సిగ్నల్ లైటు దెబ్బతింది. కారులో ఎవరూ లేకపోవడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

18న ఉచిత కంటి వైద్య శిబిరం

చీడికాడ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఖండివరం గ్రామంలో ఈనెల 18న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు స్థానిక ప్రజా ప్రతినిధి ఎస్‌వీఎస్.నాయుడు తెలిపారు. విశాఖ శంకర్‌ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ గ్రామంలోని తులసీ కళ్యాణమండపం వద్ద జరుగుతుందన్నారు. శిబిరానికి వచ్చే రోగులు తమ ఆధార్‌కార్డుతో రావాలన్నారు.

పెరిగిన చలి

మాడుగుల, డిసెంబరు 15 (ఆంఒధ్రజ్యోతి) : గత రెండురోజులుగా చలి పెరిగింది. ఉదయం 8 గంటల వరకు పొగమంచు వీడలేదు. దీంతో ప్రజలు, వివిధ పనులకు వెళ్లేవారు సైతం బయటకు రాలేకపోయారు. అలాగే, సాయంత్రం ఐదు గంటల సమయానికే చలి అధికంగా ఉండటంతో ప్రజలు వణుకుతున్నారు. దీంతో పసి పిల్లలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు.

'పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం మరువలేం'


చీడికాడలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాఠకులు

రోలుగుంట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) :స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారిణి వరలక్ష్మి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యం, అహింస, హరిజనోద్ధరణ నినాదాలతో స్వాతం త్ర్య ఉద్యమంలో పొట్టి శ్రీరాములు పాల్గొన్నారన్నారు. తెలుగువారికీ ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ దీక్ష చేపట్టి ప్రాణాలు అర్పిం చిన మహా పురుషుడు అని కొనియాడారు.

చీడికాడ: తెలుగు మాట్లాడే ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసిన మహోన్నత వ్యక్తి అని చీడికాడ గ్రంథాలయ అధికారి ఎంఎస్ఎల్ జోగేశ్వరి అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాఠకులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు

రోలుగుంట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచుగుమ్మలలో శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయం పునర్నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు శంకుస్థాపన చేశారు. ఈ ఆలయం నిర్మాణం చేపట్టి నేటికీ 150 ఏళ్లవుతోంది. దీంతో పునర్మిణానికి దేవదాయశాఖ ముందుకు వచ్చింది. ఆలయ నిర్మాణానికి రూ.50లక్షల నిధులను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి శంకుస్థాపన నిర్వహించారు. త్వరలోనే పనులు పూర్తి చేసి ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పరవాడ సత్యనారాయణ దొరచ పరవాడ నారాయణ దొర, పరవాడ నూకరాజుదొర, పరవాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మోదకొండమ్మకి వెండి శఠగోపం బహూకరణ


దాతలు అందిస్తున్న శఠగోపం

మాడుగుల రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎం.కోడూరులోని మోదకొండమ్మకి దాతలు ఆదివారం వెండి శఠగోపం బహూకరించారు. విశాఖపట్నానికి చెందిన పోతిన వెంకటరమణ, త్రివేణి దంపతుల కుమార్తెలు 300 గ్రాములు శఠగోపం తయారు చేయించి స్థానిక సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయ సన్నిధి అందజేశారు. దాతలకు గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

సాగునీటి సంఘం ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారుల గెలుపు


బెన్నవోలు నీటి సంఘం విజేతలు

చోడవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏటవతల గ్రామాల పరిధిలోని పెద్దేరు పరిధిలో జన్నవరం, బెన్నవోలు, గౌరీపట్నంలలో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో తెలుగుదేశం మద్దతుదారులు విజయం సాధించారు. బెన్నవోలు సంఘం చైర్మన్‌గా మజ్జి వెంకునాయుడు, వైస్ చైర్మన్‌గా మజ్జి సూర్యం, జన్నవరం సాగునీటి సంఘం చైర్మన్‌గా కంచిపాటి ఈశ్వరరావు, వైస్ చైర్మన్‌గా పి. రమణమ్మ, గౌరీపట్నం చైర్మన్‌గా పల్లేల గంగాధర్, వైస్ చైర్మన్, చాకిపల్లి చైర్మ న్‌గా గోవింద్, వైస్ చైర్మన్‌గా సత్యనారాయణలు ఎన్నికైనట్టు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మజ్జి గౌరీశంకరరావు తెలిపారు.

21 నుంచి తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు

▸ బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొణతాల


నాటకోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల, మాజీ ఎమ్మెల్యే పీలా

అనకాపల్లి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 21 నుంచి తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు జరగనున్నాయి. జార్జిక్లబ్ ఆవరణలో జార్జిక్లబ్, హైదరాబాద్ కళా విపంచి సంయుక్త ఆధ్వర్యంలో జరగనున్న ఈ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జార్జిక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బీఎస్ఎంకే జోగినాయుడు, బుద్ద కాశీవిశ్వేశ్వరరావు, కోశాధికారి విల్లూరి చంద్రశేఖర్, కేఎం నాయుడు పాల్గొన్నారు. 21న సాయంత్రం ఆరున్నర గంటలకు హైదరాబాద్ మహతి క్రియేషన్స్ వారి 'ఉక్కు సంకెళ్లు', రాత్రి 7.45 గంటలకు విశాఖ చైతన్య కళాస్రవంతి వారి '(అ) సత్యం' నాటికలు ప్రదర్శింపబడతాయని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జోగినాయుడు, కాశీలు ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. 22న గుంటూరు జిల్లా తాడేపల్లి అరవింద ఆర్ట్స్ వారి 'విడాకులు కావాలి', 7.45 గంటలకు బాపట్ల జిల్లా వారి 'వర్క్ ఫ్రమ్ హోం' నాటికలు ప్రదర్శింపబడతాయని చెప్పారు. అలాగే ఈ నెల 23న అనకాపల్లి షిర్డిసాయి కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి 'వేదాంతం', 7.45 గంటలకు ఉత్తరాంధ్ర శ్రీసౌజన్య కళాస్రవంతి వారి 'దేవరాగం' నాటికలు ప్రదర్శించినున్నట్టు వారు తెలిపారు.

సరియాపల్లి సాగునీటి సంఘం అధ్యక్షుడు టీడీపీలో చేరిక


వెంకటరమణను పార్టీలోకి ఆహ్వానిస్తున్న అరకు ఇన్‌చార్జి దొన్నుదొర

అనంతగిరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీంపోల్ పంచాయతీ సరియాపల్లి సాగునీటి సంఘం ఎన్నికల్లో వైసీపీ తరపున ఎన్నికైన శెట్టి వెంకటరమణ శనివారం రాత్రి టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి సీవేరి దొన్నుదొర సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వెంకటరమణకు అరకువేలి క్యాంపు కార్యాలయంలో పార్టీ కండువావేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీవేరి దొన్నుదొర మాట్లాడుతూ.. రైతులకు అన్ని విధాలుగా మేలు చేసేలా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో పల్లి సింహచలం, మాదల సింహాద్రి, ఎలుసూరి జానకేశ్వరరావు పాల్గొన్నారు.

మారథాన్ పోటీల్లో సచివాలయ ఉద్యోగి ప్రతిభ


42 కిలో మీటర్ల మారథన్‌లో మెడల్ సాధించిన గోపి

అనంతగిరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నేవీ మారథన్ పోటీల్లో అనంతగిరి మండలం రొంపల్లి సచివాలయం ఉద్యోగి కొర్రా గోపి ప్రతిభను కనబరిచారు. ఎనిమిది దేశాల నుంచి సుమారు 300 మంది వరకు ఈ పోటీల్లో పాల్గొనగా.. 42 కిలో మీటర్లను మూడు గంటల పాటుగా శ్రమించి, 7వ స్థానంలో కొర్రా గోపి నిలిచారు. మెడల్‌తోపాటుగా ఈవెంట్ పాల్గొన్నందుకు సర్టిఫికెట్‌ను అందుకున్నాడు. ఈ సందర్భంగా గోపీని మండలస్థాయి ఉద్యోగులు, సహ సచివాలయ సిబ్బంది అభినందించారు.

రూ.కోటితో గర్భిణుల సంరక్షణ కేంద్రాలు


బర్త్ హాల్ నిర్మించనున్న పీహెచ్‌సీ

కొయ్యూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కంఠారం, యు. చీడిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆవరణల్లో రూ. కోటి నిధులతో బర్త్ వెయిటింగ్ హాల్ (గర్భిణుల సంరక్షణ కేంద్రం)నిర్మాణాలకు నిధులు మంజూరైనట్టు గిరిజన సంక్షేమ శాఖ జేఈ శ్రీవిద్య తెలిపారు. ఈ మేరకు వీటి నిర్మాణాలకు సంబంధించి మార్కింగ్ ఇటీవల పూర్తి చేసినట్టు ఆమె తెలిపారు. నిర్దిష్ట వ్యవధిలో ఈ నిర్మాణాలను నాణ్యత లోపం లేకుండా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే గర్భిణుల సౌలభ్యం మేరకు నిధులు కేటాయించినందుకు తెలుగుదేశం పార్టీ నేతలు ఎంవీవీ ప్రసాద్, తోట దొరబాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	620
విజయనగరం	624
శ్రీకాకుళం	624

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	103
ఫారం ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

అమలుకాని పాలిథిన్ నిషేధం

» దుంబ్రిగుడలో కుప్పలుగా వ్యర్థాలు » తొలగింపులో నిర్లక్ష్యం

డుంబ్రిగుడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్, పాలిథిన్‌ల నిషేధం మన్యంలో సక్రమంగా అమలు కావడం లేదు. ప్రధాన కూడళ్లు, రహదారులపై ఎక్కడిక్కడ పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులు కుప్పలుగా పడి ఉంటున్నాయి. మండల పరిధి అరకు పంచాయతీ కేంద్రంలో పలుచోట్ల, ప్రధానంగా సంత పరిసరాల్లో ఎక్కడిపడితే అక్కడ ప్లాస్టిక్ సీసాలు, చెత్తాచెదారాలు దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రాల్లో కలెక్టర్ దినేశ్‌కుమార్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని అధికారులకు జారీ చేసిన ఆదేశాలను అధికారులు తూతూ మంత్రంగా అమలు చేస్తున్నారు. దీంతో ప్లాస్టిక్ వాడకం యథాతథమవుతోంది. ఇప్పటికైనా ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలుచేయాలని స్థానికులు కోరుతున్నారు.


అరకు సంతలో పేరుకున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

గురుకుల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

» ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్


ఉపాధ్యాయ, అధ్యాపకుల దీక్షలకు మద్దతు తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

పాడేరురూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల ఉపాధ్యాయ, అధ్యాపకులను సీఆర్టీలుగా గుర్తించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ డిమాండ్ చేశారు. జిల్లాలో గురుకుల ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐటీడీఏ కార్యాలయం ఎదుట 31 రోజులుగా నిరాహార దీక్షలు చేపడుతున్నారు. ఆదివారం ఆయన నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి ఉద్యోగులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గిరిజన గురుకుల విద్యాలయాల్లో ఏళ్ల తరబడి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులను సీఆర్టీలుగా మార్చాలని, 2022 పీఆర్సీ ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ 31 రోజలుగా దీక్షలు చేపట్టిన ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. దీంతో గురుకుల విద్యాలయాలలో విద్యార్థులు విద్యకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మన పిల్లల భవిష్యత్తుకు మన మద్దతు ఉండాలన్న లక్ష్యంతో గురుకుల విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల దీక్షలకు మద్దతు తెలపాలని కోరారు. ఈ నెల 18వ తేదీ బుధవారం ఉపాధ్యాయుల శిబిరంలో తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ దీక్షలను విజయవంతం చేయాలని రాజశేఖర్ పిలుపునిచ్చారు. గురుకుల ఉద్యోగులకు మద్దతు తెలుపుతూ బుధవారం నిర్వహించే తల్లిదండ్రుల నిరాహార దీక్షలకు మద్దతు తెలిపే విద్యార్థులు తల్లిదండ్రులు ఫోన్: 7901348561, 9491331748లను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు వి.కృష్ణారావు, తనీష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగుకు దూరంగా ఉండాలి


గంజాయి తోటలను దగ్ధ చేస్తున్న దృశ్యం

కొయ్యూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి వలన కలిగే అనర్థాలను గుర్తించి ఆ పంట సాగు విక్రయాలు, రవాణాకు దూరంగా ఉండాలని బూదరాళ్ల పంచాయతీ వార్డు సభ్యుడు సాగిన సంజీవ్ సూచించారు. శుక్ర, శనివారాలు పంచాయతీ పరిధిలో పలు గ్రామాలు పర్యటించిన గంజాయి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సంజీవ్ అన్నవరం గ్రామ పరిసరాలలో 15 ఎకరాలలో సాగవుతున్న గంజాయి తోటలను స్థానికయువతతో కలిసి ధ్వంస ం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు చట్టరీత్యా నేరమని ఆయా గ్రామాల గిరిజనులకు అవగాహన కల్పించారు. సులువుగా డబ్బు సంపాదించాలనే తలంపుతో యువత గంజాయి రవాణాకు పాల్పడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. గిరిజనులు ప్రభుత్వ సహకారంతో పండ్ల తోటలు పెంచుకుని పలువురికి ఆదర్శంగా నిలవాలన్నారు.

అనధికార మద్యం విక్రయదారులకు జరిమానా

చింతపల్లి, డిసెంబరు 15, (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో చింతపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన 13 అనధికార మద్యం విక్ర యదారులకు రూ. 56, 870 వేల జరిమానా విధించినట్టు స్థానిక ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జే కూర్మారావు ఆదివారం తెలిపారు. ఇకపై ఇటువంటి అనధికార మద్యం చేయరాదని సంబంధిత వ్యక్తులను జేఎఫ్‌సీఎం వారు మందలించి జరిమానా విధించి కేసులు కొట్టివేసినట్టు ఇన్‌స్పెక్టర్ కూర్మారావు చెప్పారు.

రైతుల అభ్యున్నతే కూటమి ప్రభుత్వం లక్ష్యం

» జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్


నీటి సంఘాల చైర్మన్, డైరెక్టర్లను సన్మానిస్తున్న శ్రావణ్‌కుమార్

అనంతగిరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెదకోట పంచాయతీ నీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ తరుపున ఏకగ్రీవంగా చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లుగా ఎన్నికైనా కివర్లబారికి కృష్ణమూర్తి, కూడ జోగుల, పాంగి దారప్ప, కె.రామన్నదొరలను ఆయన ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నీటి సంఘాల ఎన్నిక నిర్వహించి, రైతులను వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. ఉచితంగా విత్తనాలు, పవర్ టిల్లర్లు, ట్రాక్టర్లు అందజేయనున్నట్టు తెలిపారు. పంటలకు పుష్కలంగా నీరందించేందుకు చెక్‌డ్యాంలను నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలోని సర్పంచ్ పాండురంగస్వామి, మాజీ ఎంపీటీసీ దేముడు, నూకరాజు, వెంకటరావు, గణేష్, అచ్చిబాబు, త్రినాద్, తదితరులు పాల్గొన్నారు.

'పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేం'



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు

పాడేరురూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం నిరాహార దీక్షలు చేసి ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి ఆదివారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో చరిత్ర విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి ఘనంగా నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ టీఎస్.రసూల్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు తదితరులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ రసూల్ మాట్లాడుతూఉమ్మడి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలను వివరించారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ తదితర పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎ.మురళీధరరావు, వి.రమేష్‌బాబు, ఈవీ.విజయలక్ష్మి, జి.గౌరీశంకరరావు, కె.అప్పలనాయుడు, కొత్తంనాయుడు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ఎంఈవో ఎస్.విశ్వప్రసాద్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వి.భీమ్‌నాయుడు, కేజె.రామారావు, ప్రసాదరావు, కేశవరావు, కేశవ, ధిలీప్‌కుమార్, మత్స్యకొండబాబు, రాజేష్, మహేశ్వరి, గంగాభవాని, అరుణ, వసంతకుమారి, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

చింతపల్లిలో..


చింతపల్లిలో నివాళులర్పిస్తున్న సర్పంచ్ దురియా పుష్ప, పంచాయతీ సిబ్బంది

చింతపల్లి : స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ దురియా పుష్ప ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణలో పొట్టిశ్రీరాముల పాత్రను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సి బ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గోవాడ షుగర్స్‌లో క్రషింగ్ సీజన్‌కు శ్రీకారం

... 5వ పేజీ తరువాయి

నిర్ణయించిన ముహూర్తానికి బాయిలర్ వద్ద పూజలు నిర్వహించిన అనంతరం ఎండీ వి.సన్యాసినాయుడు బాయిలర్ వెలిగించి క్రషింగ్ సీజన్‌కు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ, గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్‌ను ఈ నెల 25వ తేదీన ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. ఓవర్‌హాలింగ్ పనులు దాదాపు పూర్తికావచ్చాయని, క్రషింగ్ సజావుగా సాగేందుకు చెరకు రైతులు, కార్మికులు సహకారం అందించాలని ఆయన కోరారు.

పంటల నిల్వ కేంద్రం సిద్ధం

» రైతాంగానికి తీరనున్న కష్టం


శింగవరం ఐటీడీఏ కాలనీ వద్ద సిద్ధమైన పంటల నిల్వ కేంద్రం

కొయ్యూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు దర వచ్చే వరకు ఫలసాయం నిల్వకు వీలుగా నిర్మించిన పంట నిల్వల కేంద్రం మండల కేం ద్రానికి సమీపాన శింగవరం ఐటీడీఏ కాలనీ వద్ద ప్రారంభానికి సిద్ధమైంది. ఉద్యానశాఖ, డీఆర్‌డీఏ సంయుక్తంగా రూ. 15 లక్షల మేర నిధులు మంజూరు చేయటంతో ఈ నిర్మాణం పూర్తి చేశారు. కలెక్షన్ సెంటరుగా పిలిచే దీనిలో రైతులు పండించిన వివిధ రకాల పంటలను గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకోవచ్చు. మండలంలో ఇప్పటి వరకు ఈ విధమైన అవకాశం లేక రైతాంగం పంట లాభం వచ్చినా నష్టం వచ్చినా అమ్ముకునే పరిస్థితి ఉంది. ఇపుడు ఈ నిల్వ కేంద్రం అందుబాటులోకి రావటంతో ఎన్ని రోజులైన పంటను నిల్వ చేసుకుని అమ్ముకునే అవకాశముంటుంది. వెలుగు ఏపీఎంను సాధనను సంప్రదించగా... ఈ భవనాన్ని రైతు ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో పంటలను ఎంత కాలమైనా నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇందుకు గానూ విద్యుత్, నిర్వహణ ఖర్చులకు అతి తక్కువ మేర (అద్దె) డబ్బులు చెల్లిస్తే సరిపోతుందన్నారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సోలార్ వీధిలైట్ల వితరణ


గిరిజనులకు సోలార్ లైట్లను పంపిణీ చేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శర్మ

అనంతగిరి, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని రొంపల్లి పంచాయతీ బూరిగ, చినకోనేలా, మంగళగుడ్డే గ్రామాలకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ తన సొంత నిధులను వెచ్చించి సోలార్ వీధిలైట్లను ఆదివారం పం పిణీ చేశారు. విద్యుత్ సౌకర్యం లేదంటూ మూ డు గ్రామాల గిరిజనులు పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. దీనిపై పలు పత్రికల్లో కథనాలు రావడంతో తనవంతుగా సోలార్ లైట్లు సమకూర్చినట్టు ఈఏఎస్ శర్మ తెలిపారు. ఆయనకు మూడు గ్రామాల గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశ్నార్థకంగా శాంతిభద్రతలు

... 5వ పేజీ తరువాయి

కన్నేసి, వారు పర్యటించని ప్రదేశాల్లో నేరాలకు పాల్పడుతున్నారు.

నెల వారీ మామూళ్లు!

జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో అధికారులు, సిబ్బంది శాంతిభద్రతల కన్నా మామూళ్ల వసూళ్లపైనే శ్రద్ధ చూపుతున్నారు. రహదారుల పక్కనున్న దాబాలు, హోటళ్లు, రెస్టారెంట్లలో అనధికారికంగా మద్యం విక్రయాలు, మద్యపానం వంటివి జరుగుతున్నప్పటికీ పోలీసులు దాడులు చేయడంలేదు. వీటి వద్ద రోడ్డుపై వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నప్పటికీ పట్టించుకోవడంలేదు. వీటి నిర్వాహకుల నుంచి నెల వారీ మామూళ్ల వసూలు చేస్తుండడమే ఇందుకు కారణమని తెలిసింది. ఎస్.రాయవరం, కోటవురట్ల, ఎలమంచిలి మండలాల సరిహద్దు గ్రామాల్లో వున్న తోటల్లో పేకాట, కోడిపందేలు నిత్యకృత్యం అయ్యాయి. ముఖ్యంగా పేకాట డెన్‌లు నిర్వహించే వ్యక్తులతో స్థానిక పోలీసులు లాలూచీ పడి, స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. ఈ నెల 13వ తేదీన ఎస్.రాయవరం మండలం ధర్మవరం అగ్రహారం శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై స్థానిక పోలీసులు కాకుండా స్పెషల్ బ్రాంచి పోలీసులు దాడి చేయడం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నది. పేకాట డెన్‌పై స్పెషల్ బ్రాంచ్ సీఐ బాల సూర్యారావు, ఎలమంచిలి రూరల్ ఎస్ఐ ఉపేంద్ర ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది దాడి చేసి 27 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని, రూ.1,89,000 నగదు, 18 మొబైల్ ఫోన్లు, 12 బైకులను స్వాధీనం చేసుకున్న తరువాతే స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు.

పోలీసు స్టేషన్‌లలో సివిల్ సెటిల్‌మెంట్‌లు

జిల్లాలోని కొన్ని పోలీస్ స్టేషన్లు సివిల్ సెటిల్‌మెంట్‌లకు అడ్డాగా మారిపోయాయి. కొన్ని పోలీసు స్టేషన్‌ల ముఖద్వారం వద్ద 'సివిల్ తగాదాలు ఇచ్చట పరిష్కరించబడవు' అనిఇ బోర్డులు పెట్టి వుంటాయి. కానీ అత్యధిక సెటిల్‌మెంట్‌లు ఇక్కడే జరుగుతుంటాయి. ఆస్తుల వివాదాల్లో వాస్తవంగా పోలీసులు తలదూర్చకూడదు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. కానీ ఆస్తుల వివాదాల్లో ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికి కొమ్ముకాస్తూ, అవతల వ్యక్తులను బెదిరించి, ఇబ్బందులకు గురి చేస్తున్నారు,

చాపకింద నీరులా గంజాయి వినియోగం

ఏజెన్సీ నుంచి అనకాపల్లి జిల్లా మీదుగా పలుమార్గాల్లో గంజాయి రవాణా అవుతున్న విషయం అందరికీ తెలిసింది. గంజాయి రవాణాను వైసీపీ ప్రభుత్వ కట్టడి చేయకపోగా, స్మగ్లర్లకు ఆ పార్టీ నేతలు సహకరించడంతో గంజాయి రవాణా, వినియోగం భారీగా పెరిగిపోయాయి. ఏజెన్సీ నుంచి జిల్లాలోకి ఏయే మార్గాల్లో గంజాయి రవాణా అవుతుందో పోలీసులకు తెలిసినప్పటికీ మాఫియా నుంచి భారీగా డబ్బులు ముడుతుండడంతో తమ స్టేషన్ పరిధిలో నుంచి సురక్షితంగా తరలేలా సహకరిస్తున్నారని నిక్కచ్చిగా పనిచేసే పోలీసు అధికారులే చెబుతున్నారు. జిల్లాలో నేరాలు పెరిగిపోవడానికి గంజాయి కూడా ఒక ప్రధాన కారణమని అంటున్నారు.

ఏయూకు అడ్వయిజరీ బోర్డు?

... 5వ పేజీ తరువాయి

విశ్వవిద్యాలయం కావడంతో ఏయూకు మంత్రి నారా లోకేశ్‌అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఉప యోగపడే ప్రకటన రావచ్చునన్న ఆశాభావాన్ని వర్సిటీ వర్గాలు వ్యక్తం చేస్తు న్నాయి. 'ఆ హబ్' పేరుతో ఇప్పటికే స్టార్టప్ సెంటర్, మరికొన్ని ఇంక్యుబేషన్ సెంటర్లు ఏయూలో ఉన్నాయి. ఈ తరహాలో మెగా సెంటర్ ఒకటి ఏర్పాటుచేసే ఆలోచనలో మంత్రి ఉన్నారని, దీనిని రాష్ట్రంలోని అన్ని సెంటర్లకు కేంద్రంగా ఏయూలో పెట్టే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

ధాన్యం విక్రయాలకు రైతులు నిరీక్షణ

... 5వ పేజీ తరువాయి

పది రోజుల నుంచి వరి నూర్పులు చేస్తున్నారు. జిల్లాలో 72 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, వీటిలో మూడు.. గొలుగొండ, ఏఎల్‌పురం, చీడిగుమ్మలు గ్రామాల్లో ప్రారంభిస్తామని ఈ నెల ఆరంభంలోనే అధికారులు ప్రకటించారు. తొమ్మిదో తేదీ నుంచి ధాన్యం సేకరణ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. కానీ వారం రోజులు అవుతున్నప్పటికీ గొలుగొండ మండలంలో ఇంతవరకు ఒక్క కొనుగోలు కేంద్రాన్ని కూడా ప్రారంభించలేదు. వరి కుప్పలు నూర్పి రెండు నుంచి మూడు వారాలు అవుతున్నప్పటికీ ప్రభుత్వ పరంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో పలువురు రైతులు పండించిన ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. మద్దతు ధర కన్నా తక్కువ రేటుకు అమ్ముకోవాల్సి వస్తున్నదని వాపోతున్నారు. కాగా మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంపై వ్యసాయాధికారి సుధావాణిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, గొలుగొండ మండలంలో ధాన్యం కొనుగోళ్ల బాధ్యతను రోలుగుంట మండలానికి చెందిన రైతు ఉత్పత్తి సహకార సంస్థకు ప్రభుత్వం అప్పగించిందని, ధాన్యం సేకరణ కోసం సిబ్బందిని నియమించి శిక్షణ కూడా ఇచ్చామన్నారు. ఈ వారంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేలా చర్యలు చేపడతామని చెప్పారు.

శీతాకాలంలో జీవాల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

» గొర్రెలు, మేకల్లో వ్యాధులు నియంత్రణలో జాగ్రత్తలు

చింతపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో చలి తీవ్రత పెరిగిపోతున్నది. దీంతో మనుషులతోపాటు జీవాలు (గొర్రెలు, మేకలు) పలు అనారోగ్యసమస్యలు ఎదుర్కోవాల్సివస్తోంది. వ్యాధులను సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టకుంటే మృత్యువాత పడి నష్టాన్ని మిగుల్చుతుంది. శీతాకాలంలో జీవాలసంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని పశు వైద్య శాస్త్రవేత్తలుసూచిస్తున్నారు.గిరిజన ప్రాంతంలో ఆదివాసీ రైతులు గొర్రెలు, మేకలు అధికంగా పెంచుతున్నారు.ప్రస్తుతం పడిపోతున్న ఉష్ణోగ్రతలు, గాలిలో తేమ అధికంగా ఉండడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రధానంగా బాహ్యపరాన్న జీవులైన దోమలు, ఈగలు, పిడుదులు సంఖ్య అధికం కావడంతో వ్యాధికారక క్రిములను వ్యాప్తిస్తున్నాయి. పాకలు శుభ్రం చేయకపోవడం, చల్లటి గాలుల నుంచి రక్షణగా వెచ్చదనం కోసం జీవాలన్ని ఒకేచోటకు చేర్చడం వల్ల వ్యాధులు ఒకదాని నుంచి మరొకదానికి త్వరగా వ్యాప్తి చెందుతాయి.

పారుడు వ్యాధి..

ఈ వ్యాధి వైరస్ వల్ల వ్యాప్తి చెందే చికిత్సలేని అతి ప్రమాదకరమైంది. ఈ వ్యాధిని కేవలం నివారణ ద్వారా అరికట్టవచ్చు. మేకలు, గొర్రెలను నివాస పాకల్లో సరైన గాలి, వెలుతురు అందకపోవడం, కలుషిత నీరు, మేత జీవాలు తీసుకోవడం వల్ల ఈ వ్యాధి సోకుతుంది. తీవ్ర జ్వరం, మేత మేయకపోవడం, కంటిలోపల శ్లేష పొరలు ముదురు ఎరుపు రంగులోకి మారడం, ముక్కు, కంటి నుంచి స్రావాలు కారడం, నోటిపైన, పెదవులపై నాలుకపై పుండ్లు, వ్యాధి ముదిరి రక్తంతో కూడిన జిగట విరేచనాలవుతాయి. ఈ వ్యాధి నివారణకు మూడు నెలలు నిండిన మేక, గొర్రెలకు ఏటా పీపీఆర్ టీకాలు వేయించాలి.

నీలి నాలుక వ్యాధి..

ఈ వ్యాధి క్యూలికోయిడ్స్ అనే దోమ కాటు వల్ల ఆర్బీ వైరస్ సోకడం వల్ల వస్తుంది. ఈ వైరస్ జీవాలలోని రక్త కణాలను విచ్ఛిన్నం చేస్తుంది. దీని వల్ల రక్తం ద్వారా ఆక్సిజన్ సరఫరా జరిగి నాలుక, శ్లేష పొరలు నీలంగా మారుతాయి. అధిక జ్వరం, ముక్కు నుంచి జిరుగు స్రావాలు కారడం, కాళ్ల ఎర్రగా వాచడం, నోటిలో పుండ్ల లక్షణాలు కనిపిస్తాయి. ఈవ్యాధి సోకిన గొర్రెలు, మేకలు చికిత్స కోసం పశువైద్యాధికారిని సంప్రదించాలి. ఆయన సూచనలపై యాంటీబయోటిక్స్,నొప్పినివారణ మందులందించాలి.

మశూచి వ్యాధి/అమ్మవారు వ్యాధి..

ఈ మశూచి వ్యాధినే షీప్/గోట్ పాక్స్ అని అంటారు. ఇది పాక్స్ వైరస్ వల్ల వస్తుంది. కలుషిత నీరు, గాలి ద్వారా ఈవ్యాధి వ్యాప్తిస్తుంది. ఈ వ్యాధి సోకిన జీవాలలో చర్మంపైన బొబ్బలు ఏర్పడి అవి బాగా మాగిన తర్వాత పగిలి పుండ్లు పడతాయి. కొన్ని సందర్భాలలో ఊపరితిత్తులపైన కూడా బొబ్బలు ఏర్పడి నియోనియాకు కారణమై జీవాలు చనిపోతాయి. నోటిలో ఉన్న పుండ్ల వల్ల నొప్పి కలిగి జీవాలు మేతమేయక నీరసించి చనిపోతాయి. ఈ వ్యాధి సోకిన జీవాలను వేరుచేసి పశువైద్యుడి సలహా ద్వారా చికిత్స అందించాలి. పుండ్లపై ఈగలు వాలకుండా పసుపు, టర్పంటైన్ కలిపిగానీ,హైమాక్స అయింట్‌మెంట్ కానీరాయాలి. ముందుగా మూడు నెలల వయస్సు దాటిన పిల్లలకు, పెద్దవాటికి టీకాలు వేయించాలి.

శ్వాసకోశ సంబంధిత వ్యాధులు..

గాలిలో తేమ, పాకలో శుభ్రతాలోపంతోవివిధ రకాల బ్యాక్టీరి యాల వల్ల శ్వాసకోస సంబంధిత రోగాలు వ్యాప్తి చెందుతాయి. ఈ వ్యాధులు సోకిన జీవాలకు అధిక జ్వరం వస్తుంది. అలాగే ముక్కు నుంచి స్రావాలు కారి, జీవాలు ఎక్కువగా తుమ్మడం, దగ్గడం లక్షణాలు కనిపిస్తాయి. క్రమేపీ నిమోనియాకు దారితీసి మరణిస్తాయి. వెంటనే పశువైద్యాధికారి సలహా మేరకు యాంటీబయోటిక్స్, యాంటీ ఎలర్జీ మందులు జీవాలకు అందించాలి.



పాకలు శుభ్రంగా ఉంచాలి



గొర్రెలు, మేకల రక్షణకు రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. జీవాల నివాస పాకలు శుభ్రంగా ఉంచాలి. ఎప్పటికప్పుడు జీవాల వ్యర్థాలను శుభ్రం చేస్తూ తేమను అరికట్టేందుకు తెల్ల సున్నం ప్ర తి వారం జల్లుకోవాలి. బాహ్యపరాన్న జీవులను పాకలోంచి నిర్మూలనకు మలథియన్ మందులు 4ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పాకలో పిచికారి చేయాలి. పాకలోకి చల్ల గాలులు చేరకుండగా పరదాలు కట్టాలి. వ్యాధి నిరోధక శక్తికి పోషక పశుగ్రాసాలను పుష్కలంగా అందించాలి. క్రమంగా నట్టల నివారణ మందులు, వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.

–డాక్టర్ విజయ రాజ్ఞి, పశువైద్య శాస్త్రవేత్త, హరిపురం

పిల్లల్లో రోగాలు..

మేకగొర్రె పిల్లల్లో చలికాలం ఇ.కొలై, కాక్సిడియేసిస్ రోగాలు ప్రబలుతుంటాయి. ఈ రోగాల్లో అధికమైన జ్వరం, పల్చగా పారడం, తల్లి వద్ద పాలు తాగకపోవడం, నీరసం లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధులు ముదిరితే పిల్లలు చనిపోతాయి. అందువల్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి. పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలి. సకాలంలో యాంటీబయోటిక్స్ వాడాలి.


మేకల్లో మశూచి లక్షణాలు


నిమోనియా సోకిన మేక

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు



శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. అనకాపల్లి డీఎస్పీ మల్లంపాటి శ్రావణి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భాషా ప్రయుక్త, రాష్ట్ర సాధన కోసం ఆమరణ దీక్ష చేపట్టి ప్రాణాలను అర్పించి అమరజీవిగా నిలిచిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని అన్నారు. మహాత్ముడు బోధించిన సత్యం, అహింస, ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన వ్యక్తి శ్రీరాములు అన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పట్టణ సీఐ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి పట్టణంలో...

అనకాపల్లి టౌన్: పట్టణంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. మెయిన్‌రోడ్డులోని కన్యకాపరమేశ్వరి జంక్షన్ వద్ద గల శ్రీరాములు విగ్రహానికి సత్యనారాయణస్వామి దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ బొడ్డేడ మురళీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ కోసం చేసిన సేవలను గుర్తు చేశారు. పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ప్రతి తెలుగువాడు ముందుకు సాగాలని కోరారు. సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెయిన్‌రోడ్డులోని అమరజీవి విగ్రహానికి అధ్యక్షుడు బల్లా నాగభూషణం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక రాష్ట్రం కోసం ఆయన చేసిన ఆమరణ నిరాహారదీక్ష, ఆయన జీవిత విశేషాలను వివరించారు. అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం: స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాల్లో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్‌వీవీ.సత్యారావు శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర ఆవిర్భావంలో శ్రీరాములు త్యాగం మరువరానిదన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో శ్రీరాములు పాత్ర గురించి వివరించారు. అంతకు ముందు విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొణతాల బాబూరావు విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే కొణతాల, మాజీ ఎమ్మెల్యే పీలా

అనకాపల్లి రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 80వ వార్డు పరిధిలోని రాజుపాలెం గ్రామంలో సూర్యనారాయణస్వామి ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబూరావు రాజుపాలెం గ్రామాభివృద్ధితో పాటు సూర్యనారాయణస్వామి ఆలయ అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మామిడిపాలెంలో కిడ్నీ పరీక్షలు



శిబిరంలో ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

తుమ్మపాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిపాలెం గ్రామంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ సొంత నిధులతో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. గ్రామంలో అధికంగా కిడ్నీ వ్యాధులతో బాధ పడుతున్నారన్న కారణంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పెద్ద సంఖ్యలో కిడ్నీ పరీక్షలు నిర్వహించారు. గ్రామస్థుల నుంచి వైద్యులు రక్త నమూనాలను సేకరించి జిల్లా ఆస్పత్రికి పంపించారు. ఇప్పటికే కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దాదాపు 200 మందికి పైగా పరీక్షలు నిర్వహించినట్టు వైద్య సిబ్బంది తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూడి పరదేశినాయుడు పాల్గొన్నారు.

ఎన్‌టీపీసీ సింహాద్రి నాలుగో యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

పరవాడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్‌టీపీసీ సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రంలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగో యూనిట్‌లో ఉత్పత్తికి శనివారం అర్ధరాత్రి అంతరాయం ఏర్పడింది. యూనిట్‌కు సంబంధించిన బాయిలర్ ట్యూబ్‌లకు రంధ్రాలు ఏర్పడడంతో ఉత్పత్తి నిలిచిపోయింది. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు ప్రారంభించారు. కాగా వార్షిక నిర్వహణ పనుల నిమిత్తం 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌ను గత నెలలో షట్‌డౌన్ చేశారు. ప్రస్తుతం ప్లాంట్‌లో ఒకటి, మూడు యూనిట్లలో మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతునట్టు అధికారులు వెల్లడించారు.

ఎన్టీపీసీ హెచ్ఆర్ డైరెక్టర్‌కు సత్కారం

పరవాడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీని హెచ్‌ఆర్ విభాగం డైరెక్టర్ అనిల్‌కుమార్ జడ్లీ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటక్ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను అతని దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం యూనియన్ తరపున జడ్లీను సత్కరించారు. కార్యక్రమంలో ఇంటక్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజేపీ లెనిన్, జనరల్ సెక్రటరీ బొండా భీమరాజు, గంగాధరరావు, సింహాద్రినాయుడు పాల్గొన్నారు.

మామిడిపాలెంలో రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

తుమ్మపాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆత్మీయ విద్యార్థి సేన ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో దాదాపు వంద మంది వరకు పూర్వ విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆత్మీయ విద్యార్థి సేన గౌరవాధ్యక్షుడు కెవీఎస్ఎల్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ శిబిరంలో పలువురు విద్యార్థులు రక్త దానం చేయడం ఆనందకరమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పల్లా రాజు, ప్రధానకార్యదర్శి గొల్లవిల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తోటాడ సింహాచలం, ఉప కార్యదర్శి పిళ్లా సురేశ్, కోశాధికారి టి.కృష్ణ, ఉప కోశాధికారి మొల్లి మురళీ పాల్గొన్నారు.

21 నుంచి తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు

» బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



నాటకోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల, మాజీ ఎమ్మెల్యే పీలా

అనకాపల్లి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 21 నుంచి తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు జరగనున్నాయి. జార్జిక్లబ్ ఆవరణలో జార్జిక్లబ్, హైదరాబాద్ కళా విపంచి సంయుక్త ఆధ్వర్యంలో జరగనున్న ఈ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జార్జిక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బీఎస్ఎంకే జోగినాయుడు, బుద్ద కాశీవిశ్వేశ్వరరావు, కోశాధికారి విల్లూరి చంద్రశేఖర్, కేఎం నాయుడు పాల్గొన్నారు. 21న సాయంత్రం ఆరున్నర గంటలకు హైదరాబాద్ మహతి క్రియేషన్స్ వారి 'ఉక్కు సంకెళ్లు', రాత్రి 7.45 గంటలకు విశాఖ చైతన్య కళాస్రవంతి వారి '(అ)సత్యం' నాటికలు ప్రదర్శింపబడతాయని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జోగినాయుడు, కాశీలు ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. 22న గుంటూరు జిల్లా తాడేపల్లి అరవింద ఆర్ట్స్ వారి 'విడాకులు కావాలి', 7.45 గంటలకు బాపట్ల జిల్లా వారి 'వర్క్ ఫ్రమ్ హోం' నాటికలు ప్రదర్శింపబడతాయని చెప్పారు. అలాగే ఈ నెల 23న అనకాపల్లి షిర్డిసాయి కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి 'వేదాంతం', 7.45 గంటలకు ఉత్తరాంధ్ర శ్రీసౌజన్య కళాస్రవంతి వారి 'దేవరాగం' నాటికలు ప్రదర్శించినున్నట్టు వారు తెలిపారు.

పరీక్షల సమయంలో శిక్షణ ఇవ్వడం సరికాదు

» యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్నబ్బాయి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమ్మేటివ్ పరీక్షలు జరుగుతున్న సమయంలో ఉపాధ్యాయులకు నాయకత్వ శిక్షణా తరగతుల పేరుతో విజయనగరం జిల్లాలో శిక్షణ ఇవ్వడం సరికాదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి పేర్కొన్నారు. సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో విద్యా శాఖ అధికారుల వైఖరిని నిరసించారు. సమావేశం ప్రారంభంలో ఇటీవల మరణించిన టీచర్స్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చినబ్బాయి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు సమ్మేటివ్ పరీక్షలు జరుగుతున్నాయని, ఇలాంటి సమయంలో ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహించడం సరికాదని పేర్కొన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య చాలా తక్కువగా ఉందన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు ఎక్కువగా ఉన్నాయని, ఇటువంటి తరుణంలో ఉపాధ్యాయులను శిక్షణా తరగతుల్లో నిమగ్నం చేస్తే పాఠశాలల్లో పిల్లలకు పరీక్షలు ఎవరు నిర్వహిస్తారని ఆయన ప్రశ్నించారు. పరీక్షలు పూర్తయిన రెండు రోజుల్లో పేపర్లు దిద్ది ఆన్‌లైన్‌లో మార్కులు కూడా నమోదు చేయాలని విద్యా శాఖ రాష్ట్ర అధికారులు ఆదేశించారని ఆయన చెప్పారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో వారం రోజులు పాటు ఉపాధ్యాయులకు నాయకత్వ శిక్షణ పేరుతో పాఠశాలకు వారం రోజుల పాటు దూరం చేయడం వల్ల ఈ పనులు ఎవరు చేస్తారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, గౌరవాధ్యక్షులు వెంకటరావు, సహాధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, జిల్లా కార్యదర్శులు పొలిమేర చంద్రరావు, కళింగ సతీష్, శేషుకుమార్, కోశాధికారి జోగా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి వనరుల అభివృద్ధికి కృషి చేయాలి

» ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ



సబ్బవరం, పెందుర్తి మండలాల్లోని సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించిన అధ్యక్ష, ఉపాధ్యక్షులతో కలిసి మాట్లాడుతున్న గండి బాబ్జీ

సబ్బవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించిన అధ్యక్ష, ఉపాధ్యక్షులు సాగునీటి వనరుల అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ సూచించారు. మొగలిపురంలోని తన స్వగృహంలో పెందుర్తి, సబ్బవరం మండలాల సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి మద్దతుదారుల విజయానికి కృషి చేసిన పార్టీల శ్రేణులను అభినందించారు. కేంద్ర ప్రభుత్వం సాగునీటి చెరువుల అభివృద్ధికి ఎన్నో నిధులు మంజూరు చేస్తున్నదని, అయినప్పటికీ గత ఐదేళ్లు చెరువుల అభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గండి దేముడు, తమరాన బంగారునాయుడు, బొండా సత్యారావు, మామిడి శంకరరావు, పడాల వెంకటరమణ, గొంప నాయనప్ప, పంచాడ శ్రీను, పైల రమణ, వడిసల రమేశ్, బోకం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ప్రతినిధులకు ఎమ్మెల్యే కొణతాల సత్కారం

కొత్తూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సత్కరించారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవెలప్‌మెంటు కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణతో కలిసి ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగునీటి కాలువల అభివృద్ధికి సభ్యులు కృషి చేయాలని సూచించారు. అనకాపల్లి నియోజకవర్గంలో సాగునీటి కాలువలు, చెరువులు, గ్రోయిన్ల మరమ్మతులకు, వాటి అభివృద్ధికి నిధులు కేటాయిస్తామన్నారు. పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తామని చెప్పారు.

వైభవంగా లలితా హోమం

సబ్బవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా మార్గశిర పౌర్ణమి పురస్కరించుకుని దేవీపురంలో దత్తాత్రేయ స్వామికి లలితా హోమం నిర్వహించారు. లలిత జయంతి సందర్భంగా సహస్రాక్షి అమ్మవారికి పంచామృత అభిషేకం, దివ్య అలంకారం, విశేష అర్చన చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు గురుపత్ని ఆశీర్వచనాలు అందించారు. మధ్యాహ్నం భక్తులకు సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుట్రస్టు నిర్వాహకులు కందర్ప ప్రభాకర్, రమా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వాక్ ఫర్ గ్రీన్ అందరికీ స్ఫూర్తిదాయకం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌క్లబ్ నిర్వహించే వాక్ ఫర్ గ్రీన్ కార్యక్రమం అందరికీ స్ఫూర్తిదాయకమని పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం తీసుకురావడం గొప్ప విషయమన్నారు. రేబాక మధుబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలన్నారు. ప్రకృతిని, జీవరాశులను సంరక్షించుకోవాలని కోరారు. అనంతరం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్‌ను సత్కరించారు.

వెదురుపర్తిలో 'విద్యార్థి మేలుకో'

కశింకోట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపర్తి గ్రామంలో ఆదివారం 'విద్యార్థి మేలుకో' కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయుడు ఏవీఎస్.మూర్తి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పదో తరగతి పరీక్షలకు బోధించాల్సిన అంశాలపై పలు సూచనలు చేశారు. వారంలో రెండు రోజుల పాటు జరుగుతున్న ఈ కార్యక్రమంలో ప్రతీ విద్యార్థి ఉత్సాహంగా పాల్గొనడమే కాకుండా చదువుపై మరింత ఏకాగ్రత వహించేందుకు అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు.

భక్తిశ్రద్ధలతో దుర్గమాంబ బోనాల ఊరేగింపు

పరవాడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం రాత్రి దుర్గమాంబ బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భవానీ మాల ధరించిన భక్తులు బోనాలు ఎత్తుకుని, వాటిలో జ్యోతులు వెలిగించి మేళతాళాలతో బొంకులదిబ్బవీధి నుంచి బయలుదేరారు. సంతబయలు, వినాయకుని గుడి, రామాలయం వీధి, దుర్గమాంబ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పోటాపోటీగా దుర్గమ్మ భక్తి గీతాలు ఆలపించారు. సర్పంచ్ ఎస్.అప్పలనాయుడు, పాల్గొన్నారు.



దుర్గమాంబ బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్స్ నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా మలేరియా శాఖ కార్యాలయంలో ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్షులుగా కె.గీతారాణి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెండ్లుగా ఎస్.లక్ష్మణరావు, సిహెచ్.శ్రీనివాసబాబు, టి.హిమబిందు, సుజాత ఎన్నికయ్యారు. అలాగే కార్యదర్శిగా ఎం.సూర్యశంకరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.అప్పలరాజు, జాయింట్ సెక్రటరీలుగా రాజాబాబు, ఎం.అప్పలరాజు, డి.వెంకట్ సుధీర్‌కుమార్, బి.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ (ఉమెన్) వీవీ వరలక్ష్మి, పద్మావతిదేవి, కోశాధికారిగా వి.చంద్రశేఖర్, ఈసీ సభ్యులుగా టి.ఉమామహేశ్వరి, కె.మహావిష్ణు ఎన్నికయ్యారు. రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు తిరుపతిబాబు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎస్‌వీఆర్ కిశోర్, దురాణి, విశాఖపట్నం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి ఎస్.ఈశ్వరరావు, మాజీ అధ్యక్షుడు కేవీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు జరిగే కూడళ్ల గుర్తింపు



తరచూ ప్రమాదాలు జరిగే తాళ్లపాలెం ప్రధాన కూడలి

కశింకోట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు తరచూ జరిగే కూడళ్లను డ్రోన్ కెమెరాలతో గుర్తించే కార్యక్రమాన్ని పోలీసులు ఆదివారం చేపట్టారు. సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో మండల పరిధిలోని కూడళ్లను గుర్తించి డ్రోన్లతో ఫొటోలను తీశారు. కశింకోట కూడలి, ఫిష్ పెట్రోలు బంకు జంక్షన్, బయ్యవరం, కూడలి, హెరిటేజ్ కూడలి, జమాదులపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, తాళ్లపాలెం, గొబ్బూరు, నర్సింబిల్లి, నూతనగుంటపాలెం జంక్షన్లను పరిశీలించి డ్రోన్ కెమెరాలతో ఫొటోలు తీయించారు. ఆయా కూడళ్లలో ప్రమాదాల జరిగేందుకు కారణాలపై గ్రామస్థులతో చర్చించారు. ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకునేందుకు చర్యలు చేపడుతున్నామని సీఐ తెలిపారు. కూడళ్లను దాటేటప్పుడు వాహన చోదకులు, గ్రామస్థులు ఇరువైపులా వాహనాల రాకపోకలను గమనించాలని ఆయన సూచించారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఎంజీహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థుల సందడి

కొత్తూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సత్యనారాయణపురంలోని ఆలయ ప్రాంగణంలో ఆదివారం 2004-2005 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకున్నారు. మున్సిపల్ గవరపాలెం హైస్కూలులో చదువుకున్న సుమారు వంద మంది ఒకే వేదికపై కలుసుకొని ఆనందంగా గడిపారు. నాటి మధురమైన జ్ఞాపకాలను గుర్తు చేసుకొని స్థితిగతులను చెప్పుకున్నారు. ప్రతి ఏటా కలుసుకోవడమే కాకుండా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ఐక్యంగా ముందుకు వెళ్లాలని వారు నిర్ణయించుకున్నారు.

యోగాతో శారీరక రుగ్మతలు నయం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ నడక, యోగా చేయడం ద్వారా అనేక శారీరక రుగ్మతలను నయం చేసుకోవచ్చునని డాక్టర్ డీడీ నాయుడు అన్నారు. ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఆదివారం వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు వాకర్స్ సందేహాలను నివృత్తి చేశారు. 2024 సంవత్సరానికి అనకాపల్లి వాకర్స్ క్లబ్‌కు ఉత్తమ క్లబ్ అవార్డు వచ్చినందుకు అధ్యక్షులు భీశెట్టి రామకృష్ణను అభినందించారు. అనంతరం 2025 సంవత్సరం కొత్త వాకర్స్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాపేటి నారాయణరావు, కార్యదర్శిగా యల్లపు సాంబశివరావు, కోశాధికారి కె.సత్యనారాయణ తదితరులను ఎన్నుకున్నారు.

ఉపాధ్యాయుల వన సమారాధన

అనకాపల్లి రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పాక, మర్రిపాలెం, తారకరామకాలనీ, సీహెచ్ఎన్ అగ్రహారం పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఆదివారం వన సమారాధన నిర్వహించుకున్నారు. ఆయా పాఠశాలల పరిధిలోని పర్యాటక, ఉద్యాన కేంద్రాలను సందర్శించి సహ పంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల అభివృద్ధి, విద్యాభివృద్ధి, విద్యార్థుల హాజరు పెంపు, వెనుకబడిన విద్యార్థులపై చర్యలు తదితర అంశాలపై వారు చర్చించుకుని ఎంఈవోలకు నివేదికను అందజేశారు.

నేటి నుంచి ధనుర్మాస వేడుకలు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దేమునిగుమ్మం, గాంధీనగరం వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో సోమవారం నుంచి ధనుర్మాస వేడుకలు ప్రారంభం కానున్నాయి. తెల్లవారుజామున ఆలయ అర్చకులు శ్రీవారికి ప్రత్యేక పూజలతో వేడుకలు ప్రారంభమవుతాయి. నెల రోజులు పాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా ముక్కోటి ఏకాదశి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ప్రతి రోజూ తెల్లవారుజామున భక్తులు శ్రీవారిని దర్శించుకుని పూజలు చేయడానికి సిద్ధమవుతున్నారు.

'స్మార్ట్ మీటర్లు బిగించొద్దు'

అనకాపల్లి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు భారాలు పెంచే స్మార్ట్ మీటర్లు బిగించవద్దని పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం గవరపాలెంలోని పలు ప్రాంతాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం విద్యుత్ వినియోగదారునిపై వేసే అదనపు భారాలైన ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బి.వెంకటఅప్పారావు, మల్లికార్జునరావు, పెంటకోట శ్రీనివాసరావు, బొడ్డేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా దివ్యాంగుల ఆటల పోటీలు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం జిల్లా స్థాయి దివ్యాంగుల ఆటల పోటీలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను ఎస్‌డీ గ్రూప్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్ జెండా ఊపి ప్రారంభించారు. పోటీలను నాలుగు విభాగాలుగా కేటాయించి నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ అనకాపల్లిలో సుమారు 400 మంది దివ్యాంగులు ఉన్నారని, వారికి ఆటల పోటీలు నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని చెప్పారు. జిల్లాలోని దివ్యాంగులకు ఎటువంటి అవసరం ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరుయాదవ్, పలు సంఘాల ప్రతినిధులు కనిశెట్టి సురేష్‌బాబు, రాజాన దొరబాబు, గాడి బాలు, చదరం నాగేశ్వరరావు, డి. హరిష్, మొల్లి చంద్రశేఖర్, కోరుకొండ నాగరాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయుని జయంతి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఆలయాల్లో ఆదివారం దత్తాత్రేయుని జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. దిబ్బవీధి, వేగివీధి రామాలయాల్లో కొలువుదీరిన దత్తాత్రేయునికి తెల్లవారుజామున ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దత్తాత్రేయుని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వేగివీధి రామాలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధనకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

పరవాడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనువాసరావు పిలుపునిచ్చారు. వార్డు పరిధిలోని లంకెలపాలెం మరిడిమాంబ కాలనీలో ఆదివారం ఆయన వివిధ రకాల మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో మొక్కలు నాటితే కాలుష్యం నుంచి కాపాడుకోవచ్చన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శారదానది పాత బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. విషయం తెలియగానే పట్టణ పోలీసులు వెళ్లి పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తి వయసు 60 ఏళ్లు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయంలోని మార్చ్యురీలో భద్రపరిచామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.